బొమ్మూరులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్



యువతకు ఉద్యోగం లేదా ఉపాధి కల్పించడమే లక్ష్యం

- మంత్రులు నిమ్మల, కందుల
- రాజమహేంద్రవరంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం



రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు నిమ్మల, కందుల, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి, ఎమ్మెల్సీ సోమా, నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ శేషారావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో యువతకు ఉద్యోగం లేదా ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, పర్యాటక సాంస్కృతికశాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ కళాశాలలో నిర్మించిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కేంద్రాన్ని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, రూరల్, అర్బన్ ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్ కేంద్రాలు సీఎం చంద్రబాబునాయుడు మానస పుత్రికలని అన్నారు. ఈ హబ్ ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి, కొత్త ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు విస్తృతంగా అందిస్తామని, గోదావరి జిల్లాలు వ్యవసాయంతోపాటు పారిశ్రామిక రంగంలో కూడా ముందంజలో నిలుస్తాయన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రాబోయే తరానికి దిక్సూచి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న చంద్రబాబు సంకల్పం దీంతోనే ప్రారంభమైందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తలపెట్టిన ప్రతి ఆవిష్కరణాత్మక కార్యక్రమానికి ప్రధాని మోదీ పూర్తి సహకారముంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జేసీ చిన్న రాముడు, గ్రీన్ కోర్ చైర్మన్ జి.రాంబాబు, నన్నయ్య వీసీ వి.ప్రసన్న, గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు, ఆదిత్య యూనివర్సిటీ చైర్మన్ శేషారెడ్డి, పలు విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిందాల్‌కు జై

రామేశంమెట్ట చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ ప్రతిపాదిత ప్రాంతం



ఉమ్మడి జిల్లాలో రోజువారీ ఉత్పత్తయ్యే చెత్త నుంచి విద్యుత్ తయారుచేసేందుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఎక్కడికక్కడ కొండల్లా పేరుకుపోతూ ప్రజారోగ్యానికి చేటు చేస్తున్న చెత్త ఇకపై కనిపించకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీన్నంతా ఒకేచోటకు చేర్చి దాని నుంచి విద్యుత్ తయారుచేయడానికి ఎట్టకేలకు టెండర్లు ఖరారు చేసింది. పోటీలో ప్రముఖ జిందాల్ సంస్థ ప్రాజెక్టు దక్కించుకుంది. పెద్దాపురం మండలం రామేశంమెట్టలో 35 ఎకరాల్లో దీన్ని ఏర్పాటుచేయడానికి కంపెనీ తాజాగా ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. రెండు దశల్లో మొత్తం రూ.1270 కోట్ల పెట్టుబడిని జిందాల్ సంస్థ పెట్టబోతోంది. తొలి దశలో రూ.370 కోట్లతో చెత్త నుంచి రోజుకు 12 మెగావాట్ల విద్యుత్ తయారుచేయనుంది. వాస్తవానికి ఈ ప్రాజెక్టును అనపర్తి నియోజకవర్గం బలభద్రపురంలో ఏర్పాటు చేయాలని భావించినా కుదరలేదు. చివరకు రామేశంమెట్ట ఖరారైంది

- జిందాల్ చేతికి రూ.370 కోట్ల చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్
- టెండర్లలో వర్క్ ఆర్డరు దక్కించుకున్న కంపెనీ
- రెండు దశల్లో మొత్తం రూ.1270 కోట్ల పెట్టుబడికి నిర్ణయం
- ఎట్టకేలకు పెద్దాపురం రామేశంమెట్ట అనుకూలంగా ఉండడంతో ఖరారు
- అంతకుముందు కాకినాడ,పిఠాపురంతోపాటు ఏడుచోట్ల స్థలాల పరిశీలన
- ఉమ్మడి తూ.గో. జిల్లాలో చెత్తంతా ఒకేచోటకు తరలించి 12 మెగావాట్ల విద్యుత్ తయారీ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు కలిపి 11 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో రోజు భారీగా చెత్త పోగవుతోంది. నిత్యం ఈ చెత్తంతా మున్సిపల్ సిబ్బంది నగరాలు, పట్టణాలకు దూరంగా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. ఇందుకోసం వందలకొద్దీ వాహనాలు, ఉద్యోగులు అవసరమవుతున్నారు. ఇలా ఏళ్ల తరబడి పోగవుతున్న చెత్తతో ఆయా ప్రాంతాల డంపింగ్ యార్డులు కొండలను తలపిస్తున్నాయి. వీటికి నిప్పంటిస్తుండడంతో తీవ్ర వాయుకాలుష్యం వెలువడుతోంది. అటు తీవ్రమైన దుర్వాసనతో జనం ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు సైతం తలెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో వీటన్నింటికి విరుగుడుగా ఈ చెత్తనంతటిని మండించి విద్యుదుత్పత్తి చేపట్టేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. అందులో భాగంగా చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్రాజెక్టును రూ.370 కోట్లతో పట్టాలెక్కించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 11 మున్సిపాల్టీలతోపాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మరో 11 కార్పొరేషన్లు, మున్సిపాల్టీలను కలిపి కాకినాడ-రాజమహేంద్రవరం క్లస్టర్‌గా ప్రభుత్వం ప్రతిపాదించింది. ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమతో కలిపి రోజుకు 950 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతున్నట్టు లెక్కలు కట్టింది. ఇందులో అత్యధికంగా ఉమ్మడి తూర్పు పరిధిలోని కాకినాడ కార్పొరేషన్‌లో రోజుకు 144 టన్నులు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ 160, పిఠాపురం 26, పెద్దాపురం 25, సామర్లకోట 23, రామచంద్రపురం 23, మండపేట 26, ముమ్మిడివరం 11, అమలాపురం మున్సిపాల్టీ పరిధిలో 30 టన్నుల చొప్పున చెత్త రోజువారీ వస్తోంది. ఈ చెత్తంతటిని ఒకచోటకు చేర్చి దీనితో విద్యుదుత్పత్తి చేయడానికి అధికారులు అంచనా వేయగా, రోజుకు 12మెగావాట్ల వరకు విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని తేల్చారు. 12మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌కు రూ.370 కోట్ల వరకు ఖర్చవుతుండగా, ఒక్క పైసా కూడా ప్రభుత్వం పెట్టుబడి పెట్టకుండా ప్రైవేటు కంపెనీయే భరించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే కంపెనీయే ఈ మొత్తం భరించేలా టెండర్లు పిలిచింది. ఎంపికైన సంస్థ ఈ మొత్తం భరిస్తే ప్రభుత్వం తరఫున చెత్త ఇవ్వడం, ఉత్పత్తయిన విద్యుత్‌ను 25ఏళ్లపాటు సదరు కంపెనీయే సొంతంగా విక్రయించుకునే వెసులుబాటు కల్పించింది. ఒకరకంగా చెప్పాలంటే ప్రభుత్వానికి ఏమాత్రం భారం లేకుండా రెండు కార్పొరేషన్లు, తొమ్మిది మున్సిపాల్టీల్లో చెత్తంతా బయటకు వెళ్లిపోనుంది. అయితే తాజాగా ఈ ప్రాజెక్టుకు పిలిచిన టెండర్లలో పలు కంపెనీలు పోటీపడగా, ప్రముఖ జిందాల్ కంపెనీ వర్కు ఆర్డరు సొంతం చేసుకుంది. దీంతో ప్రభుత్వం ఈ సంస్థతో ఇటీవల ఒప్పందం ఖరారు చేసుకుంది. ప్రాజెక్టుకు కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు కావలసి ఉండడంతో దరఖాస్తు చేసుకుంది. ఇప్పటికే జిందాల్ గుంటూరులో చెత్త నుంచి విద్యుత్ తయారుచేస్తోంది.

అన్నీ చూసి.. రామేశంమెట్ట ఓకే చేసి..

ఈ ప్రాజెక్టుకు అనువైన ప్రదేశం కోసం పలు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు తొలుత అనపర్తి నియోజకవర్గం బిక్కవోలులో 12, బలభద్రపురంలో 20ఎకరాలు ఎంపిక చేశారు. 12 ఎకరాల్లో విద్యుత్‌ప్లాంట్, 20ఎకరాల్లో తెచ్చిన చెత్త, ఫ్లైయాష్ పోగుచేసేలా ప్రతిపాదించారు. తద్వారా చెత్త నుంచి తయారయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించేలా విద్యుత్ లైన్ ఉండడంతో ప్రాజెక్టు ఖరారు చేశారు. తీరా దీనిపై స్థానిక ప్రజలు, అటు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. దీంతో ప్రత్యామ్నాయంగా కాకినాడ జిల్లాలో కాకినాడ సిటీ, పిఠాపురం చెందుర్తితోపాటు మరో ఏడుచోట్ల అధికారులు పరిశీలించారు. పెద్దాపురం రామేశంమెట్ట అనుకూలంగా ఉన్నట్టు గుర్తించారు. ఈ ప్రాంతం జనావాసాలకు దూరంగా ఉండడం, పైగా ఈ ప్రాంతం ఏడీబీ రహదారిని అనుకుని ఉండడంతో చెత్త వాహనాల రాకపోకలకు అనువుగా ఉంటుందని నిర్ణయానికి వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే రాజప్ప సైతం ఈ ప్రాంతంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు సుముఖంగా ఉండడంతో ఎట్టకేలకు రామేశంమెట్టను ఖరారు చేశారు. జిందాల్ సంస్థ సైతం ఇక్కడ ప్రాజెక్టుకు అనుకూలత ఉండడంతో 35 ఎకరాలు కోరింది. దీంతో కొన్ని రోజుల కింద ఆ కంపెనీకి 16 ఎకరాల ప్రభుత్వ భూములు అప్పగించారు. మరో 19 ఎకరాలు చెత్తనిల్వ, ఫ్లైయాష్ నిల్వకు అవసరం ఉండడంతో సమీపంలో ఉన్న డీపట్టా భూములు గుర్తించారు. రైతులకు ఎకరాకు రూ.19 లక్షల వరకు ఇచ్చేలా చర్చలు జరుపుతున్నారు. తొలివిడత ప్రాజెక్టు పూర్తయ్యాక మలివిడత ఈ ప్రాజెక్టుపై జిందాల్ మరో రూ.900 కోట్ల పెట్టుబడి పెట్టనుంది.

డిప్యూటీ సీఎం ఇలాకా..
ఇన్‌-చార్జిల జమానా



- అధికారులపై పని ఒత్తిడి
- కీలక అధికారులకు అదనపు బాధ్యతలు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

కీలకమైన అధికారులకు అదనపు బాధ్యతలు.. ఆపై పనిఒత్తిడి.. భర్తీ కాని పోస్టులు ఇది డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో పరిస్థితి. ఇన్‌చార్జిల ఏలుబడిలో పాలనతో ఇబ్బందికరంగా మారింది.

పిఠాపురం నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన సేవలందించడంతోపాటు పేదరిక నిర్మూలన, అభివృద్ధికార్యక్రమాలపై ప్రత్యక్ష పర్యవేక్షణ కోసం రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నియోజకవర్గం కుప్పం తర్వాత ఇక్కడే పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటుచేశారు. దీనికోసం పలు ప్రాంతాల్లో ఆర్డీవోగా పనిచేసిన ఎ.చైత్రవర్షిణిని పాడా ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించారు. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ చైర్మన్‌గా ఉన్నారు. 21శాఖలను పాడా పరిధిలోకి తీసుకురావడంతో అధికారులు, సిబ్బందిపై పూర్తి పర్యవేక్షణ వారికే అప్పగించారు.అధికారుల బదిలీలు, డిప్యూటేషన్లు కూడా పాడా అంగీకారంతోనే జరపాలని, ప్రత్యామ్నాయ అధికారులు రాకుండా ఇక్కడ పనిచేస్తున్న వారిని రిలీవ్ చేయవద్దని ప్రభుత్వం పాడా ఏర్పాటు జీవోలో స్పష్టం చేసింది. ఇంతవరకూ బాగానే ఉన్నా పాడా ఏర్పాటు తర్వాత కూడా పలువురు అధికారుల బదిలీ, డిప్యూటేషన్‌పై వెళ్లినా, ఉద్యోగ విరమణ చేసినా కొత్త అధికారులను నియమించలేదు. దీంతో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. పాడా పీడీగా ఉన్న చైత్రవర్షిణి కూడా జిల్లా పర్యాటక శాఖాధికారి ఇన్‌చార్జి బాధ్యతల్లో ఉన్నారు.

రెండు చోట్ల ఒక్కరే..

నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు ఉన్నాయి. గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనరుగా ఉన్న రవికుమార్ ఉద్యోగ విరమణ చేయడంతో నాలుగున్నర నెలల క్రితం పిఠాపురం మునిసిపల్ కమిషనరు నామ కనకరావును ఇన్‌చార్జిగా నియమించారు. అప్పటినుంచే రెండుచోట్ల ఆయన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల అభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తున్న నేపథ్యంలో పనుల పర్యవేక్షణ, ఇతరత్రా కార్యక్రమాల నిర్వహణ భారం ఆయనపై పడింది.

తహసీల్దారు.. ఎంపీడీవోలూ అంతే..

గొల్లప్రోలు తహసీల్దారుగా పనిచేసిన సత్యనారాయణ జూన్ నెలాఖరుకు ఉద్యోగ విరమణ చేయగా అప్పటినుంచి పిఠాపురం తహసీల్దారు గోపాలకృష్ణ ఇక్కడ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. పిఠాపురం ఎంపీడీవో చినబాబు బదిలీకాగా గొల్లప్రోలు ఎంపీడీవో కర్రి స్వప్నను ఇన్‌చార్జిగా నియమించారు. కొత్తపల్లి డిప్యూటీ ఎంపీడీవో సత్యకృష్ణారెడ్డికి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కీలకమైన నాలుగు పదవుల్లో ఇన్‌చార్జిలే కొనసాగుతుండడంతో ఆ ప్రభావం పాలనపై పడింది.

ఎంఎస్‌వోలదీ అదే పరిస్థితి..

చౌకధరల దుకాణాల నిర్వహణ పర్యవేక్షించే పిఠాపురం ఎంఎస్‌వో శ్రీనివాస్ పాడా కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తుండగా పెద్దాపురం ఎంఎస్‌వో భారతికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. గొల్లప్రోలు ఎంఈవో-1 వెంకటేశ్వరరావుకు కాకినాడడివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పిఠాపురం ఎంఈవో-1 ఇన్‌చార్జిగా బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్ హెచ్‌ఎం శ్యాంబాబు, చేబ్రోలు సెరీకల్చర్ ఆఫీసర్ ఇన్‌చార్జిగా ఏఎస్‌వో సత్యనారాయణ వ్యవహరిస్తున్నారు. పిఠాపురంలో ఇరిగేషన్ ఏఈ పోస్టు ఒకటి ఖాళీగా ఉంది.

వైద్యులదీ అంతే..

గొల్లప్రోలు మండలం చేబ్రోలు పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యాధికారులను బదిలీ చేశారు. ఏజెన్సీ నుంచి ఇద్దరిని నియమించినా వారు ఇంకా విధుల్లో చేరలేదు. దీనితో రెండున్నర నెలలుగా వైద్యులు లేని పరిస్థితి ఉంది. ఇతర ప్రాంతాలనుంచి ఒక వైద్యుడిని పంపి సేవలందేలా చూస్తున్నారు. గొల్లప్రోలు రూరల్ పీహెచ్‌సీలో ఒక వైద్యురాలే పనిచేస్తున్నారు. ఇక్కడ మరో పోస్టు ఖాళీగా ఉంది. పిఠాపురం సీహెచ్‌సీలో వైద్యులు ఉన్నా అదనంగా స్టాఫ్‌నర్సులను నియమించాల్సిన అవసరం ఉంది. పిఠాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఒక ఎస్‌ఐ మాత్రమే ఉన్నారు. అదనపు ఎస్‌ఐ, ట్రాఫిక్ ఎస్‌ఐ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. గొల్లప్రోలు, పిఠాపురం టౌన్, రూరల్, కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగాఉండడంతో వారిపైనే భారంపడుతోంది.

కీలక పోస్టులు ఖాళీ

పిఠాపురం పురపాలక సంఘంలో కీలకమైన పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అత్యంత ప్రధానమైన పట్టణ ప్రణాళిక విభాగంలో టీపీవో మాత్రమే ఉన్నారు. రెండు టీపీఎస్, రెండు టీపీబీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పట్టణంలో అక్రమ కట్టడాలను నిరోధించలేని పరిస్థితి ఉంది. మరో కీలకమైన రెవెన్యూ విభాగంలో మునిసిపల్ రెవెన్యూ అధికారి, రెండు ఆర్‌ఐ పోస్టులు ఖాళీగా ఉండగా, ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. పారిశుధ్య విభాగంలో ఒక శానిటరీ సూపర్‌వైజరు, ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాత్రమే ఉన్నారు. ఎన్విరాన్‌మెంటల్ ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. గొల్లప్రోలు నగర పంచాయతీలో మేనేజరుగా పనిచేస్తున్న రామప్రసాద్ తెనాలి పురపాలక సంఘానికి డిప్యూటేషన్‌పై వెళ్లగా అప్పటినుంచి పోస్టు ఖాళీగా ఉంది. టీపీఎస్, టీపీబీవో పోస్టులతోపాటు రెవెన్యూ అధికారి, ఆర్‌ఐ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎన్విరాన్‌మెంటల్ ఏఈ, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్ని కీలకమైన పోస్టులు ఖాళీ ఉంటే ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించడం, పాలన సజావుగా సాగడం ఎలాగనేది ప్రశ్నార్థకంగా మారింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తోపాటు జిల్లా కలెక్టర్ పిఠాపురం నియోజకవర్గ పరిధిలో కీలకమైన పోస్టుల భర్తీపై ప్రత్యేక దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

31వరకు ప్రధానమంత్రి ఫసల్ బీమాకు గడువు

- ఇప్పటివరకు ప్రీమియం చెల్లించిన 30,900మంది రైతులు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో రైతులు చేరడానికి ఈ నెల 31 వరకు గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. రైతులు పంటల బీమా చేయించుకుని తమ పంటలను సంరక్షించుకోవడానికి మరోఅవకాశం లభించింది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి రైతులు నష్టపోయినప్పుడు ప్రధానమంత్రి ఫసల్ బీమా ఎంతో ఆదు కుంటుంది. జిల్లాలో ఇప్పటివరకు 30,900మంది రైతులు ఈ పథకంలో ప్రీమియం చెల్లించారు. జిల్లాలో ఉన్న మిగిలిన రైతులు కూడా ఫసల్‌బీమా యోజనలో చేరి తమ పంటలను సంరక్షించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రధానంగా ప్రతిఏటా ఖరీఫ్ సీజన్‌లో అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో వచ్చే తుపాన్ల నుంచి ఇది ఎంతో రక్షణగా నిలుస్తోంది.

నేడు జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా నిర్వహించే అమరావతి చాంపియన్‌షిప్ కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో అండర్-22 వయసుగల జిల్లాకుచెందిన పురుషులు, మహిళలు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడాప్రాంగణంలో గురువారం నిర్వహించే బాస్కెట్‌బాల్ జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తిగల క్రీడాకారులు మధ్యాహ్నం 3 గంటలకు అర్హతగల పత్రాలతో హాజరుకావాలని డీఎస్‌డీవో శ్రీనివాస్ కుమార్ తెలిపారు. 22ఏళ్లలోపు వారు అర్హులని, పుట్టినతేదీ ధ్రువపత్రం పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లు జారీ చేసినసర్టిఫికెట్లు పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో రావాలని కోరారు.

15వరకూ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు

- అపరాధరుసుంతో అవకాశం: డీఈవో

కాకినాడ రూరల్,ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్‌లో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు అపరాధరుసుముతో సెప్టెంబరు 15 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో పి.రమేష్ తెలిపారు. సంబంధిత రుసుమును ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా చెల్లించవచ్చన్నారు. విద్యార్థులు దరఖాస్తును సంబంధిత స్టడీసెంటర్ నుంచి ఉచితంగా పొంది వివరాలను పూరించి సమన్వయకర్త ద్వారా తప్పులేమైనా ఉంటే సరిచూసుకుని ఏపీ ఆన్‌లైన్ కేంద్రం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఆన్‌లైన్ దరఖాస్తు జిరాక్స్ కాపీని, ఫీజు రశీదును సంబంధిత ఏ1 కేంద్రానికి ఇవ్వాలని, 30రోజులు విధిగా తరగతులకు హాజరుకావాలని సూచించారు.స్టడీ సెంటర్లో ఫీజులు చెల్లించక్కర్లేదని, దళారులను నమ్మి మోసపోవద్దని, వివరాలకు ఏ1 కేంద్రాలు లేదా సార్వత్రిక విద్య జిల్లా సమన్వయకర్త సాయివెంకటరమణను 89776 45704 నెంబరులో సంప్రదించాలన్నారు.

జిల్లాలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేస్తాం

- ఏపీ పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సుధీర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్‌మాఫియాకు అడ్డుకట్ట వేస్తామని ఏపీపౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్ అన్నారు. కాకినాడ పౌరసరఫరాలశాఖ కార్యాలయంలో జిల్లాలోని ఆ శాఖ అధికారులతో బుధవారం ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌మాఫియా, ఆయిల్‌మాఫియాను పూర్తిగా నియంత్రిస్తామన్నారు. దీనిపై అధికారులకు ప్రత్యేకంగా ఆదేశాలు ఇచ్చామన్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో చెక్‌పోస్టులవద్ద నిరంతరం తనిఖీలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో ఎక్కడైనా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరిగితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇతరరాష్ట్రాలనుంచి అక్రమంగా జిల్లాలోకి వచ్చే పెట్రోలు, డీజిల్ ఉత్పత్తులపై ప్రత్యేకంగా తనిఖీలు చేయాలని ఆదేశించామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్‌మాఫియాపైనే ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించామన్నారు. జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ దేవులనాయక్, ఏఎస్‌వో లక్ష్మీప్రసన్న, డిప్యూటీ తహసీల్దార్ విజయకుమార్ పాల్గొన్నారు.

'వర్షాకాలంలో ఆరోగ్యం' అంశంతో స్వచ్ఛాంధ్ర

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):ఈనెల23న జిల్లావ్యాప్తంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను 'వర్షాకాలంలో ఆరోగ్యం' అనే అంశంపై నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు ఒక ప్రకటన వెలువరించారు. వర్షాకాలంలో ఎదురయ్యే డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణా చర్యలపై విస్తృత ప్రజా భాగస్వామ్యంతో నిర్వహించాలన్నారు. జిల్లాలోఉన్న పట్టణాలు, గ్రామీణ ఆవాసాల్లో డ్రైన్లు, నల్లాలు, మురుగు కుంటలను శుభ్రపర్చేందుకు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్, దోమల బ్రీడింగ్‌ప్రాంతాల్లో రసాయనాలు వెదజల్లాలన్నారు. కలుషిత నీటివల్ల, కీటకాలవల్ల వచ్చే వ్యాధులనివారణపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు, రచ్చబండలు, సామూహిక కూడళ్లవద్ద చేతుల పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ, పాఠశాల విద్య, గ్రామీణనీటి సరఫరా శాఖల సమన్వయంతో నిర్వహించాలన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జేసీ



పెద్దాపురంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ రాహుల్, ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న సీఎం చంద్రబాబు పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా అధికారులతో కలిసి జేసీ రాహుల్ మీనా, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బుధవారం పరిశీలించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దాపురంలో పర్యటించనున్నారు. ఈ ప్రదేశాలను జేసీ, ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎం పర్యటనకు అధికసంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో చేపట్టాల్సిన ఏర్పాట్లను ఆరాతీశారు. కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతం కావడానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు శాఖల అధికారులతో చర్చించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఆర్డీవో శ్రీరమణి, తహశీల్దార్ వెంకటలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మోటారుసైకిల్‌పై కలెక్టర్, ఎస్పీల పర్యటన

సామర్లకోట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలో ఈనెల 23న సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్ బుధవారం పరిశీలించారు. వారి పర్యటనలోభాగంగా సామర్లకోటలో ఎస్పీ బిందుమాధవ్ మోటార్‌సైకిల్ నడుపుతుండగా కలెక్టర్ షాన్‌మోహన్ వెనుక కూర్చొని పెద్దాపురంలోని సీఎం సభావేదిక, హెలీప్యాడ్ రూట్‌లను పరిశీలించారు. వర్షం కారణంగా సభాస్థలికి గానీ, ప్రజావేదికకు గానీ అంతరాయం లేకుండా ఏర్పాట్లను నిర్వహించేలా ఆర్డీవోలను కలెక్టర్ ఆదేశించారు.



మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న కలెక్టర్ మోహన్, ఎస్పీ మాధవ్

టీడీపీ కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ పదవికి పిల్లి సత్తిబాబు రాజీనామా

సర్పవరం జంక్షన్(కాకినాడ రూరల్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ నియోజకవర్గం టీడీపీ కోఆర్డినేటర్ పదవికి పిల్లి సత్యనారాయణమూర్తి కోఆర్డినేటర్ రాజీనామా చేస్తూ బుధవారం రాత్రి పార్టీ అధిష్ఠానానికి లేఖ పంపారు. నాలుగుపేజీల లేఖలో తన రాజీనామాకు దారితీసిన పరిస్థితులు, పార్టీ మండల అధ్యక్షుడి ఎంపిక, కోకోఆర్డినేటర్‌తో ఇబ్బందులు, జనసేన ఎమ్మెల్యేనుంచి కొరవడిన సహకారం వంటి కారణాలను ప్రస్తావించారు. పదవికి రాజీనామా చేసినా క్రియాశీలక కార్యకర్తగా పార్టీలో కొనసాగుతానన్నారు.



పసుపు కొమ్ములతో ఆరు అడుగులు

గణపతిని తయారు చేసిన గొల్లప్రోలు తాపీమేస్త్రీ కోలా వీరబాబు

గొల్లప్రోలు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించని విగ్రహాలు తయారు చేయాలనే అతడి సంకల్పం ఏటా వినూత్నంగా గణనాథుని విగ్రహాల తయారీపై దృష్టి పెట్టేలా చేసింది. ఆరేళ్లుగా భిన్నమైన విగ్రహాలను తయారు చేసి నిలుపుతున్నారు.


వీరబాబు

కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణానికి చెందిన తాపీ మేస్త్రీ కోలా వీరబాబు ఆరు అడుగుల ఎత్తున గల పసుపు కొమ్ముల వినాయక విగ్రహాన్ని తయారు చేశారు. దాదాపుగా నెల నుంచీ ఇదే పనిలో నిమగ్నమై ఉన్న ఇతను ప్రస్తుతం గణనాథుడికి తుది మెరుగులు దిద్దుతున్నాడు. ఆరు కిలోల తేనె మైనం, మట్టి, గడ్డి, తొమ్మిది కిలోల పసుపు కొమ్ములు వినియోగించి దీనిని తయారు చేశాడు. దీనిని తాటిపర్తి పుంత రోడ్డులో వినాయక చవితి సందర్భంగా నిలపనున్నట్టు వీరబాబు చెప్పాడు. గత ఆరేళ్లలో మట్టి వినాయకుడితో పాటు పసుపు, పిండి, కాణి పాకం, రుద్రాక్షలతో వినాయక విగ్రహాలను తయారు చేశారు. పర్యావరణానికి హాని కలిగించని రీతిలో వినాయకుడిని తయారు చేయాలనే సంకల్పమే తనను ఇటువైపు నడిపించిందని వీరబాబు తెలిపాడు. అతడు తయారు చేస్తున్న ఈ పర్యావరణహిత విగ్రహాలు అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి.

“ వినాయక చవితికి గణనాథుని విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. వివిధ రకాల ఆకృతిలో వీటిని తయారు చేయడంలో రాజస్థాన్‌కు చెందిన కళాకారులు నిమగ్నమయ్యారు. అక్కడి నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారు విగ్రహాల తయారీ ద్వారానే కుటుంబాలను పోషించుకుంటున్నారు. రెండు అడుగులు నుంచి 15 అడుగుల ఎత్తు వరకు గల విగ్రహాలను వీరు తయారు చేస్తున్నారు. చవితికి ఆరు నెలల ముందు నుంచే వీరు విగ్రహాల తయారీకి శ్రీకారం చుట్టి ఉత్సవాల సమయానికి ప్రజలు కోరిన విధంగా సిద్ధం చేస్తారు. ”

ఓ బొజ్జ గణపయ్య... మీ బంటు మేమయ్య




కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ శివారులో రాజస్థాన్ కార్మికులు తయారు చేసిన వినాయక విగ్రహాలు

- వినాయక విగ్రహాల తయారీలో రాజస్థాన్ కార్మికులు
- ఆరు నెలలు ముందు నుంచే ఇదే పనిలో...
- కుటుంబాలతో ఇక్కడే స్థిరపడ్డ రాజస్థానీయులు
- విగ్రహం రూపు ఒక రోజులోనే
- ఫినిషింగ్ టచ్‌లకు రెండు నుంచి మూడు నెలలు
- రెండు నుంచి 15 అడుగుల వరకు విగ్రహాల తయారీ

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

హిందూ సంప్రదాయంలో వినాయక చవితికి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. ప్రతి ఒక్కరూ గణనాథునికి పూజలు నిర్వహించి తాము చేపట్టే కార్యక్రమాలకు విఘ్నాలు రాకుండా చూడాలని ప్రార్థిస్తారు. అదే సమయంలో గ్రామాలు, పట్టణాలు, నగరాలు బేధం లేకుండా వీధివీధినా వినాయక విగ్రహాలు నిలిపి నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో పెద్ద వినాయక విగ్రహాల ఏర్పాటుపై ఆయా ప్రాంతాల్లోని ఉత్సవ కమిటీల మధ్య పోటీ నెలకొంటుంది. ప్రతిఏటా విగ్రహాల ఎత్తు, సైజు పెంచుకుంటూ వెళ్తారు. కొన్ని ప్రాంతాల్లో ఆకర్షణీయంగా ఉండే వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తారు. ఇలా భారీ విగ్రహాలను తయారు చేసేది మాత్రం రాజస్థాన్ కార్మికులే. వీరి కుటుంబాలు ఇక్కడకు వలస వచ్చి స్థిరపడి విగ్రహాల తయారీలోనే కొనసాగుతున్నారు. ఆరు నెలల పాటు గణనాథుని విగ్రహాలు, మిగిలిన ఆరు నెలలు తీర్థాల్లో రకరకాల చిన్నచిన్న బొమ్మలు విక్రయించి కుటుంబాలను పోషించుకుంటున్నారు.

రాజస్థాన్ నుంచి కడియ మట్టి తీసుకువచ్చి

వినాయక విగ్రహాల్లో వినియోగించే కడియ మట్టి, వైట్ మట్టి (ప్లాస్టర్ ఆఫ్ పారిస్)ని రాజస్థాన్ నుంచి, కొబ్బరి పీచుని యానాం, కోనసీమ జిల్లా నుంచి తీసుకువస్తారు. సాధారణ మట్టిని స్థానికంగా కొనుగోలు చేస్తారు. ఒక టన్ను కడియ లేదా వైట్ మట్టి రూ.3వేలు నుంచి 4వేలు వరకు ఉంటుంది. విగ్రహం రూపును వీరు కేవలం ఒక రోజులోనే తయారు చేస్తారు. తుది మెరుగులు దిద్ది రంగులు వేయడానికి, విగ్రహంపై కొనుగోలుదారులు కోరిన విధంగా మార్పులు చేయడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పడుతుందని చెప్తున్నారు. రెండు అడుగులు నుంచి 15 అడుగుల ఎత్తు వరకు గల విగ్రహాలను వీరు తయారు చేస్తారు. సాధారణ మట్టితో విగ్రహాలు తయారు చేస్తున్నా వీటికి ఆర్డర్లు తక్కువగా ఉండడంతో చవితికి దగ్గర చేసి వీటిని తయారు చేస్తారు.

ఆరు నెలల ముందు నుంచే

వినాయక చవితికి అవసరమైన విగ్రహాల తయారీని ఆరు నెలలు ముందుగానే ప్రారంభిస్తారు. ఇందుకు అవసరమైన ముడి సరుకులను ఆర్డర్ ఇచ్చి తెప్పించుకుంటారు. ముందు ఏడాది విక్రయాలు సాగిన తీరుని బేరీజు వేసుకుని ఏయే రకాల విగ్రహాలు తయారు చేయాలో నిర్ణయించుకుంటారు. వినాయక చవితికి వారం మాత్రమే ఉండడంతో ఇప్పటికి తయారు చేసిన విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఫినిషింగ్ టచ్‌లకే అధిక సమయం పడుతోందని కార్మికులు తెలిపారు. ముందుగా ఆర్డర్లు ఇచ్చిన వారికి తయారు చేసి ఇస్తామని, మిగిలిన విగ్రహాలను వచ్చిన వారికి వచ్చినట్లు విక్రయిస్తామన్నారు. విగ్రహాలకు తుది మెరుగులు దిద్ది వారం, పది రోజుల ముందు రంగులు వేస్తామని తెలిపారు. ఆరు నెలల్లో వందకి పైగా విగ్రహాలు తయారు చేస్తామని, డిమాండ్ ఉంటే ఇంకా అధికంగా సిద్ధం చేస్తామని చెప్పారు.

దశాబ్దానికి పైగా ఇదే వృత్తిలో

రాజస్థాన్ నుంచి సుమారు 200కి పైగా కుటుంబాలు విగ్రహాల తయారీలో నైపుణ్యాన్ని సంపాదించాయి. వీరు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడి అక్కడ విగ్రహాలు తయారు చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో పిఠాపురం, పెద్దాపురం, తుని, కాకినాడ, యానాం-తాళ్లరేవు ప్రాంతాల్లోను, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో వీరు ఖాళీ స్థలాలు అద్దెకు తీసుకుని కుటుంబాలతో సహా అక్కడే ఉంటున్నాయి. పిల్లలను ఇక్కడే చదివిస్తున్నారు. పిఠాపురం పట్టణ శివారులోని 216 జాతీయ రహదారి చెంతనే రెండు కుటుంబాలు నివాసముంటూ విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఎనిమిది మంది ఇదే వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి 12 సంవత్సరాలు కాగా, పిఠాపురం వచ్చి నాలుగు సంవత్సరాలు దాటింది.

విగ్రహాలు లేదంటే బొమ్మలు

చవితికి గణనాథుని విగ్రహాలు తయారు చేసిన తర్వాత వీరు మిగిలిన ఆరు నెలలు బొమ్మలు, చిన్నచిన్న దేవుని విగ్రహాలను తయారు చేస్తారు. వీటిని వివిధ ప్రాంతాల్లో జరిగే తీర్థాలకు తీసుకువెళ్లి విక్రయిస్తారు. కొందరు ప్రత్యేకంగా వారికి కావాల్సిన రీతిలో విగ్రహాలకు ఆర్డర్లు ఇస్తే వాటిని తయారు చేస్తారు. విగ్రహాలు, బొమ్మల తయారీ, విక్రయాల ద్వారా కుటుంబానికి గతంలో నెలకు రూ.50వేలు వచ్చేదని, ఇప్పుడు ముడిసరుకుల ధర పెరగడంతో అది సగానికి పడిపోయిందని కార్మికులు తెలిపారు. ఈ ఏడాదైనా ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో విగ్రహాల అమ్మకం బాగా జరగాలని ఆశిస్తున్నట్టు వారు చెప్పారు.





విగ్రహాల తయారీయే ఆధారం

అమరారామ్, పాలి జిల్లా, రాజస్థాన్

వినాయక విగ్రహాల తయారు చేసి విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయమే మా కుటుంబాలకు ఆధారం. ఏటా ఆరు నెలలు ఇదే పనిలో ఉంటాం. మిగిలిన సమయంలో బొమ్మలు తయారు చేసి విక్రయిస్తూంటాం. మా కుటుంబాలు ఇక్కడే స్థిరపడ్డాయి. పిల్లల చదువులు ఇక్కడే సాగుతున్నాయి. ఎప్పుడైనా ఫంక్షన్లు జరిగినప్పుడు మాత్రమే రాజస్థాన్ వెళ్తాము.



పూజల్లో మా గణనాథులు ఉండడం ఆనందదాయకం

బికారామ్, పాలి జిల్లా, రాజస్థాన్

మా చేతిలో రూపుదిద్దుకున్న గణనాథులు వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మందిరాల్లో పూజలు అందుకోవడం ఆనందదాయకం, పూర్వజన్మసుకృతం. మా కుటుంబ సభ్యులందరూ ఇదే పనిలో నిమగ్నమై ఉంటాం. తయాలో సంప్రదాయానికి పెద్ద పీట వేస్తాం. ఏటేటా భారీ విగ్రహాలకు డిమాండ్ పెరుగుతోంది. ముడిసరుకుల ధరల పెరిగిన రీతిలో విగ్రహాల ధరలు పెరగకపోవడంతో మాకు వచ్చే ఆదాయం తగ్గుతోంది.


ధవళేశ్వరం వద్ద దిగువకు వదులుతున్న వరద నీరు


శబరి బ్రిడ్జిని ఆనుకుని ప్రవహిస్తున్న వరద వ్యూ

ఉధృతంగా గోదావరి

- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా పెరుగుతున్న నీటిమట్టం
- భద్రాచలం వద్ద మొదటి హెచ్చరిక జారీ

ధవళేశ్వరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రవాహం నుంచి వస్తున్న వరద నీటితో ధవళేశ్వరంవద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. మంగళవారం సాయంత్రం వరకు తగ్గిన నీటిమట్టం 10అడుగులకు చేరుకుని 16 గంటల పాటు నిలకడగా కొనసాగింది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 7.50లక్షల క్యూ సెక్కులు సముద్రంలోకి ప్రవహించింది. ఆపై బుధవారం ఉదయం 10గంటల నుంచి స్వల్ప పెరుగుదల నమోదైంది. సాయంత్రానికి 10.30 అడుగులకు చేరుకుంది. ఆపై నీటిమట్టం వేగంగా పెరుగుతూ రాత్రి 9గంటలకు 10.70 అడుగులకు చేరుకోగా 8,40,754 క్యూసెక్కులు సముద్రంలోకి వదిలేశారు. అర్ధరాత్రి దాటిన తరువాత మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 11.75 అడుగులకు నీటిమట్టం చేరుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

అంతటా అప్రమత్తత

గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో ఫ్లడ్ కన్జర్వేటర్, హెచ్‌వర్క్స్ ఈఈ శ్రీనివాసరావు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఫ్లడ్ సెక్షన్ అధికారులు, ఫ్లడ్ సూపరింటెండెంట్ విధుల్లో చేరివారికి కేటాయించిన రూట్లలో విధులు నిర్వహిస్తున్నారు. ఫ్లడ్ స్టోర్‌లో ఫ్లడ్ మెటీరియల్‌ను సిద్ధం చేశారు. ఔట్‌ఫాల్ స్లూయిస్‌ల వద్ద వరద నీరు ప్రవేశించకుండా తగుచర్యలు చేపడుతున్నారు.

●ఎగువున భద్రాచలం వద్ద బుధవారం ఉదయం 9గంటలకు నీటిమట్టం 43 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆపై క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం రాత్రి 9గంటల సమయానికి 47.70 అడుగులకు చేరుకుని రెండో ప్రమాద హెచ్చరిక దిశగా పెరుగుతోంది.

ప్రమాద హెచ్చరికలు ఇవే

ధవళేశ్వరంవద్ద కాటన్ బ్యారేజ్ ద్వారా 10 లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తూ ఉండగా నీటిమట్టం 11.75 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. నీటి మట్టం 13.75అడుగులకు చేరి 13లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తూ రెండో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. నీటి మట్టం 17.75అడుగులకు చేరి 18లక్షల క్యూసెక్కులు పైబడి వరద నీరు ప్రవహిస్తూ ఉంటే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తూ ఉంటారు. నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరిక దాటిన తరువాత సర్కిల్ ఎస్ఈ ఫ్లడ్ కన్జర్వేటర్‌గా వ్యవహరిస్తారు.

● భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక, 48 అడుగులు దాటితే రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగుల వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది.

ఎగువ నీటిమట్టాలు ఇదే

ఎగువ ప్రాంతాల్లో నీటిమట్టం పెరుగుదల వేగం నెమ్మదించింది. బుధవారం సాయంత్రానికి కాళేశ్వరంవద్ద నీటిమట్టం 12.82మీటర్లుగా నమోదుకాగా, పేరూరువద్ద 17.44మీటర్లు, దుమ్ముగూడెంవద్ద 12.80 మీటర్లు, భద్రాచలంవద్ద 46.60 అడుగులు, కూనవరంవద్ద 18.40 మీటర్లుకుంటవద్ద 9.70మీటర్లు, పోలవరంవద్ద 11.78 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జివద్ద 15.55మీటర్లుగా నీటిమట్టాలు నమోదయ్యాయి.

పెరుగుతున్న శబరి గోదావరి

● ముంపు మండలాల్లో అల్లూరి జిల్లా ఎస్పీ పర్యటన




చింతూరు: సోకిలేరు వాగు దాటి సంతకు వెళుతున్న గిరిజనులు, కమాండ్ కంట్రోల్ రూమ్‌ని పరిశీలిస్తున్న అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

చింతూరు: గోదావరి, శబరినదుల ఉధృతి మళ్లీ పెరుగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి రాత్రి ఎనిమిది గంటలకు 47 అడుగులు దాటి ప్రవహిస్తోంది. అదే దశలో చింతూరువద్ద శబరి నది 33అడుగుల మేర ప్రవహిస్తోంది. బుధవారం ఉదయం నుంచి గోదావరిఉధృతి పెరుగుతుండడంతో ఆ నీరంతా కూనవరం వద్ద శబరికి ఎగపోటునిస్తోంది. దీంతో బుధవారం ఉదయం వరకు తగ్గిన శబరి నది ఉధృతి సాయంత్రం నుంచి తిరిగి పెరగడం మొదలైంది. దీంతో ఒడిస్సాకు వెళ్లే 30వ నెంబరు జాతీయ రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అదే దశలో చీకటి వాగు, సోకిలేరు వాగు పొంగడంతో చింతూరు-వరరామచంద్రపురం మండలాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు-కూనవరం నడుమ కొండ్రాజుపేట వద్ద ప్రధాన రహదారిపై వరద నీరు చేరడంతో ఈ రెండు మండలాల నడుమ కూడా రాకపోకలు నిలిచిపోయాయి. మొత్తంమీద మూడోరోజు కూడా చింతూరు మండలంలో 16 గ్రామాలు జల దిగ్బంధనంలోనే మగ్గుతున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు చెందిన బాధితులు బుధవారం వారాంతపు సంతకు నాటు పడవల మీదుగా వాగులు దాటి వచ్చి నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసుకున్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లండి

● అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

చింతూరు: డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లో ముంపు ప్రాంతాలలో అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన లోతట్టు వాసులకు అధికారులకు పలు సూచనలిచ్చారు. ప్రధానంగా వరద ప్రభావం ఉన్న ప్రతి గ్రామం నుంచి బాధితులు సురక్షిత ప్రాంతాలకు సకాలంలో తరలి వెళ్లాలన్నారు. ఈ మేరకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. చింతూరు ఐటీడీఏలో ఏర్పాటుచేసిన పోలీస్ కంట్రోల్ రూమ్ పనితీరుని ఆయన పరిశీలించారు. ఎస్పీ వెంట రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, ఓఎస్డీ జగదీష్ హడహళి, ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా, చింతూరు సీఐ గోపాలకృష్ణ, ఎటపాక సీఐ కన్నపరాజు అధికారులు వున్నారు.

జల దిగ్బంధంలో 30 గ్రామాలు

వీఆర్‌పురం: వారం రోజులుగా ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీవర్షాలకు గోదావరి, శబరినదులు ఉగ్రరూపం దాల్చాయి. దీంతో వరదనీరు గ్రామాల్లోని ప్రధాన రహదారుల పైకి గోదావరి వరదనీరు చేరడంతో రాకపోకలు నిలిచాయి. ఈ వరదనీరు కారణంగా 30 గ్రామాలు పైగానే జలదిగ్బంధంలో ఉన్నాయి.

భూవిజ్ఞాన శాస్త్రాల్లో పట్టు సాధించాలి

● జియోసైన్సస్ విభాగాధిపతి ఆచార్య శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): జియోసైన్సస్ విద్య, పరిశోధనలలో విద్యార్థులు పట్టు సాధించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జియోసైన్సస్ విభాగాధిపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని ఉన్నతస్థానాలను అధిరోహించాలని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జియోసైన్సస్ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ డి.ఎస్.ఎన్.రాజు అండ్ మహదేవన్ మెమోరియల్ అవార్డులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. దీనికి శ్రీనివాసరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ మైక్రోపాలియంటాలజీ అప్లికేషన్ నైపుణ్యంపై స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నామన్నారు. జియోసైన్సస్‌లో ప్రతిభకనబరచిన విద్యార్థులకు మెమోరియల్ అవార్డులను అందజేస్తామన్నారు. పీఎం ఉషా పథకంలో భాగంగా దీనిని నిర్వహిస్తున్నామని చెప్పారు. చెన్నై ఎఎన్జీసీ పూర్వచీఫ్ జియాలజిస్ట్ ఎ.నల్లపరెడ్డి మాట్లాడుతూ శాస్త్రరంగంలో డాక్టర్ డి.ఎస్.ఎన్.రాజు అందించిన సేవలను ప్రశంసించారు. డాక్టర్ డి.ఎస్.ఎన్.రాజు స్మారక అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు ఆయనను అనుసరిస్తూ సమాజానికి ఆదర్శవంతంగా నిలవాలన్నారు. యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ ఆచార్య ఎస్.ఎస్. హుస్సేన్ మాట్లాడుతూ ఆచార్య మహదేవన్ చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఆ తరువాత డాక్టర్ డిఎస్ఎన్ రాజు మెమోరియల్ అవార్డులు మొదటి సంవత్సరంలో సబ్జెక్టులో మొదటిస్థానం పొందిన 2022 బ్యాచ్ విద్యార్థి యార్లగడ్డ నాగసాయి, ద్వితీయస్థానం పొందిన మానేపల్లి బ్లెస్సీ, 2023లో మొదటి రెండు స్థానాలు పొందిన ఆముదల విజయకుమార్, నందివాడ తేజస్వినికి అందజేశారు. మహదేవన్ అవార్డును 2022 బ్యాచ్ యార్లగడ్డ నాగసాయి, 2023 బ్యాచ్ కీర్తి షాతనకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, పి.ఎం.ఉషా కోఆర్డినేటర్ కె.రమణేశ్వరి, అధ్యాపకులు కె.వి.స్వామి, కె.నూకరత్నం, డి.వి.తేజ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో తక్షణం బీసీ కులగణన చేపట్టాలి

● బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు డిమాండ్


ఐక్యత చాటుతున్న బీసీ సంఘ నాయకులు

కాకినాడ సిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తక్షణం బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శొంఠి నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం కాకినాడ కొండయ్యపాలెంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు యనమదల రవి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ అట్టడుగున ఉన్న బీసీలు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టకపోవడంతో రాజకీయంగా అవకాశాలు కోల్పోతున్నా రన్నారు. రాష్ట్ర జనాభాలో అత్యధికంగా 139 ఉప కులాలు గల బీసీలు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలను అత్యధికంగా చట్టసభలకు పంపించడమే లక్ష్యంగా అందరూ పని చేయాలన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు యనమదల రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో జిల్లాలో బీసీలకు చాలా అన్యాయం జరుగుతోందన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా మూడుసార్లు నెగ్గిన వనమాడి కొండబాబు క్యాబినెట్ హోదాలో మంత్రి పదవి ఇవ్వాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మికి రాష్ట్రస్థాయి చైర్‌పర్సన్ పదవి కల్పించాలన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రవికి ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగిస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు ప్రకటించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పెంకే రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసంశెట్టి త్రిమూర్తులు, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనుసూరి సతీష్, నాయకులు కొండా వినాయక్, కొప్పిశెట్టి చంద్రమౌళి, చొక్కా జగన్, కాదా శివరామకృష్ణ, రాయుడు దుర్గ, పెంకే వెంకటలక్ష్మి, మట్టపర్తి మోన, రచ్చ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమజిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికి 3వ విడత ప్రవేశం కోసం ఈనెల 26లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ, కోనసీమజిల్లాల కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థి ఏ ఐటీఐలో చేరాలో దానిని తప్పనిసరిగా ఆన్‌లైన్ అప్లికేషన్‌లోనే ఎంపిక చేసుకోవాలన్నారు. మొదటి, రెండవ విడతల్లో సీట్లు రాని వారు తప్పనిసరిగా మూడో విడత ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ అయిన అభ్యర్థులందరూ ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో ఈనెల 27వ తేదీలోపు సర్టిఫికెట్ వెరిఫికేషన్, అప్రూవల్ చే యించుకోవాలన్నారు. అలా చేయని వారు కౌన్సెలింగ్‌కు అర్హులు కాదన్నారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు ఏవైనా సందేహాలు ఉంటే 0884-2348182/9440408182లో సంప్రదించాలని కోరారు.


శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయ స్వామి, నృసింహ సరస్వతి

నేటి నుంచి శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు

● వారం రోజులు ప్రత్యేక పూజలు

పిఠాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదుని జన్మస్థానంగా విరాజిల్లుతున్న కాకినాడజిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో గురువారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు జరుగనున్నాయి. వారంరోజులు ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈఉత్సవాల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర, గోవా, ఉత్తరాదితో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు. వీరికోసం ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మహాసంస్థానంలో సద్గురు సజ్జనగడ రామస్వామి దివ్య ఆశీస్సులతో వేదోక్త విధి అనుసరించి సప్తాహదీక్షతో శ్రీపాద జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయవుతాయి. ఉదయం శ్రీపాదశ్రీవల్లభుల వారికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. 21 నుంచి 27 వరకు ప్రతిరోజూ ఉదయం మహాగణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాద శ్రీవల్లభుల వారి మహిమాన్విత దివ్యపాద పద్మాలకు మహన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, తీర్థ ప్రసాద వినియోగం, ఋత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్టాన ము, గణపతి అధర్వ ఉపనిషత్ పారాయణ, శ్రీగురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరిత్ర పారాయణ జరుగుతాయి. సాయంత్రం 4గంటలకు అగ్ని ప్రతిష్ఠాపన, దత్త మంత్ర హోమం, సాయంత్రం 5గంటలకు శ్రీపాద శ్రీవల్లభుల వారి దివ్య పాద పద్మాలకు వివిధ హారతులు, స్వామివారికి పల్లకి సేవ, సాయంకాలార్చన, మంగళహారతి నిర్వహిస్తారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. 21న శ్రీపాదశ్రీవల్లభులకు సర్వపుష్ప పూజ, 22న సహస్ర చామంతి పూజ, 23న లక్ష తులసిఅర్చన, 24న సహస్ర లిల్లీ పుష్ప పూజ, 25న లక్ష బిల్వార్చన, 26న సహస్ర గులాబీ అర్చన, 27న శ్రీపాద జయంతి రోజున పూలంగి సేవ, మారేడుపత్రి పూజ, పూర్ణాహుతి జరుగుతాయి. సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. జయంత్యుత్సవాలకు వచ్చే భక్తుల కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనలకు అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు.

ఉద్యోగ, ఉపాధికి కేంద్రంగా ఏపీ

- తీర్చిదిద్దుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆవిష్కాంధ్ర సాధనలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఓ మైలురాయి
- రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభ సభలో మంత్రి నిమ్మల


హబ్ ప్రారంభ సభలో ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి నిమ్మల, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో ఆవిష్కాంధ్ర సాధన సభ జరిగింది. దీనికి మంత్రి నిమ్మలతోపాటు కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ముప్పిడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర స్కిల్ డవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, నన్నయ్య యూనివర్సిటీ వీసీ వి.ప్రసన్న, గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు, ఆదిత్య యూనివర్సిటీ చైర్మన్ శేషారెడ్డి, గెయిల్ ప్రతినిధి కేవీఆర్‌రావు, ఓఎన్‌జీసీ ప్రతినిధి కేవీకే రాజు, గ్రీన్ కోర్ చైర్మన్ ఐరాంబాబు హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. తొలుత మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్ ప్రాంగణం నుంచి సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని డిజిటల్ స్ర్కీన్‌పై తిలకించారు. చంద్రబాబు ఇంట్రపెన్యూర్‌పై ఆయ న విజనరీని ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. అనంతరం కళాకేంద్రంలో జరిగిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడారు. ఆవిష్కాంధ్ర సాధనలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఓ మైలురాయి అని అన్నారు. విజన్ 2020 అంటే ఆనాడు సాధ్యమా అని అనుకున్నారని, కాని ప్రతీ ఇంటికి ఒక సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌ను తయారు చేయడంలో చంద్రబాబు లక్ష్య సాధకులయ్యారన్నారు. ఇప్పుడు అమరావతి కేంద్రంగా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ, పరిశ్రమలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లాఅండ్ ఆర్డర్ బాగుండాలని, వాటిని సరిచేసి రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ హబ్‌గా మార్చాలన్నదే చంద్రబాబు సంకల్పమన్నారు. అందులో భాగంగా ఆవిష్కాంధ్ర దిశగా తొలి అడుగు పడడం ఎంతో సంతోషదాయకమన్నారు. యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు.

ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్త...

ఈ హబ్ ద్వారా భవిష్యత్తులో ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త పుట్టుకొస్తారనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. గోదావరి జిల్లాలు వ్యవసాయ అధారిత జిల్లాలని, ఈ ఇన్నోవేషన్ హబ్ ద్వారా రానున్నరోజుల్లో పారిశ్రామిక రంగంలోనూ ఈ జిల్లాలు ముందు వరుసలో నిలబడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్ల జాబ్ క్యాలెండర్ లేక, డీఎస్సీ నోటిఫికేషన్లు రాక యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరమయ్యారని, ఆనాడు యువతను డ్రగ్స్‌కు బానిసలుగా మార్చి రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని, కూటమి ప్రభుత్వం వచ్చాక వాటన్నింటినీ సరిచేసి రాష్ట్రాన్ని ఉద్యోగ, ఉపాధి రంగాలకు కేంద్రంగా మార్చుతున్నారని చెప్పారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి నిమ్మల


హాజరైన పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు

రాష్ట్రం మరింత ముందుకు...

రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ చంద్రబాబు విజన్‌లో భాగంగా ప్రవేశపెట్టిన ఈ ఇన్నోవేషన్ హబ్ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా మరింత ముందుకు తీసుకువెళ్తుందని చెప్పారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. స్కిల్ డవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తును గొప్పగా మలిచేందుకు ఈ ఇన్నోవేషన్ హబ్ ద్వారా సీఎం చంద్రబాబు నాంది పలికారన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు మాట్లాడుతూ చంద్రబాబు కృషి ఫలితంగానే ఈరోజు దేశవిదేశాలలో మనవాళ్లు మంచి స్థాయిలో ఉద్యోగాల్లో ఉన్నారన్నారు. తొలుత నన్నయ్య యూనివర్సిటీ వీసీ వి.ప్రసన్న, గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు, ఆదిత్య యూనివర్సిటీ చైర్మన్ శేషారెడ్డి, గెయిల్ ప్రతినిధి కేవీఆర్ రావు, ఓఎన్‌జీసీ ప్రతినిధి కేవీకే రాజు, గ్రీన్ కోర్ చైర్మన్ ఐ.రాంబాబు మాట్లాడారు. చంద్రబాబు ఆలోచనలో అందరు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, దీనికి తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని వక్తలు అన్నారు. అనంతరం అందరితో కలెక్టర్ ప్రశాంతి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాకేంద్ర ప్రాంగణంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను తిలకించారు. సభలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, జిల్లా రెవెన్యూ అధికారి టీ.సీతారామమ్మూర్తి, రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, తాడేపల్లిగూడెం ఎన్ఐటీ ప్రతినిధి రవికిరణ్ శాస్త్రి, వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రతినిధి డీన్ డాక్టర్ ఎస్.సూర్యకుమారి, పారిశ్రామికవేత్తలు,ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.


స్టాల్స్‌ను తిలకిస్తున్న మంత్రి, కలెక్టర్

దంపతుల దారుణ హత్య

హంతకుడు అల్లుడే

- కత్తితో నరికేసిన వైనం
- తప్పించుకున్న కుమార్తె
- తూర్పుగోదావరి జిల్లా ఘంటావారిగూడెంలో ఘటన


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్


హత్యకు గురైన ఏకుల బాబూరావు, శారద (ఫైల్‌ఫొటో)


రోదిస్తున్న కుమార్తె నాగేశ్వరి


హత్య చేసిన కోటేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

నల్లజర్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలో బుధవారం అత్తమామల ను అత్యంత కర్కశంగా అల్లుడు కత్తితో నరికి చంపిన వైనమిది. ఘంటావారిగూడెం గ్రామానికి చెందిన ఏకుల బాబూరావు(55), శారద(50) దంపతులకు నాగేశ్వరి, అప్పారావు సంతానం. నాగేశ్వరికి ఏలూరు జిల్లా దెందులూరు మండలం గంగన్నగూడెం గ్రామానికి చెందిన మారిది కోటేశ్వరరావుతో 15 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి లోకేష్, గిరీష్ ఇద్దరు కుమారులు. నాగేశ్వరికి భర్తతో ఏడాది కిందట విభేదాలు రావడంతో అత్తింటి నుంచి పుట్టింటికి ఇద్దరు కుమారులతో వచ్చి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. గత నెల భర్త కోటేశ్వరరావు వచ్చి అందరినీ చంపేస్తానని బెదిరించడంతో ఇరుగుపొరుగు వారిని పిలవడంతో అక్కడ నుంచి వెళ్లిపోయాడు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు బైక్‌పై వచ్చి తన వెంట తెచ్చుకున్న కత్తితో బయట ఉన్న అత్త శారదను అత్యంత పాశవికంగా పీక కోశాడు. తన కళ్ల ఎదుటే ఈ దారుణం చూసిన భర్త బాబూరావు తప్పించుకునేందుకు లోపలికి వెళుతుండగా ఇంటి ఆవరణలో కత్తితో ఆయన పీక కోశాడు. ఇద్దరు రక్తపు మడుగులో కొట్టుకుని అక్కడిక్కడే మృతి చెందారు. భార్యను చంపేందుకు ప్రయత్నించగా తలుపులు వేసుకుని కేకలు వేయడంతో కోటేశ్వరరావు అక్కడ నుంచి పారి పోయాడు. సంఘటన జరిగిన వెంటనే కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, సీఐ బాలశౌరి, దేవరపల్లి సీఐ నాయక్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీ లించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ వృద్ధ దంపతులు ఘంటవారిగూడెం సెంటర్‌లో హోటల్ నడుపుకుంటూ జీవిస్తున్నారు. ఈ దారుణ ఘటనతో గ్రామస్తులు భయందోళన చెందారు. హత్య చేసిన నిందితుడు కోటేశ్వరరావును 24గంటలలోపు పట్టుకుని కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ దేవకుమార్ తెలిపారు.

సూచించిన ప్రదేశాల్లోనే గణేష్ నిమజ్జనం

మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి : ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్


సఖినేటిపల్లి పోలీసుస్టేషన్‌లో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

అంతర్వేది, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సూచించిన ప్రదేశాల్లోనే గణేష్ విగ్రహాల నిమజ్జనం కార్యక్రమాలు చేపట్టాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్పష్టంచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి పోలీసుస్టేషన్‌కు బుధవారం ఆయన విచ్చేశారు. తొలుత పోలీసుస్టేషన్ వద్ద గౌరవ వందనం స్వీకరించగా జిల్లా ఎస్పీ కృష్ణారావు, డీఎస్పీ మురళీమోహన్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. లాకప్, స్టేషన్‌ను పరిశీలించి ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న గణేష్ నవరాత్రులను ప్రతీ ఒక్కరు భక్తిశ్రద్ధలతో బాధ్యతాయుతంగా నిర్వహించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మండపాల వద్ద భక్తి గీతాలు ఆలపిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అక్రమ విద్యుత్ సరఫరాలు లేకుండా మండపాల వద్ద ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. పోలీసు, కలెక్టర్‌ల ఆదేశాల మేరకు సూచించిన ప్రదేశాల్లో మాత్రమే నిమజ్జన కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ నిమజ్జన కార్యక్రమాలు చేపట్టకుండా ప్రమాదాలకు చెక్ పెట్టాలన్నారు. అలాగే కోనసీమ జిల్లాలో కూడా అన్ని స్టేషన్లలో ఉద్యోగాల భర్తీకి సన్నద్ధం చేశామన్నారు. ప్రధానంగా గంజాయి సేవించడం, రవాణాపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. బ్యాంకు లావాదేవీలు జరిపేటప్పుడు అనుమానితులకు సమాచారం ఇవ్వకుండా ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విశ్రాంత ఉద్యోగుల ఇళ్ల వద్ద దోపిడీలకు పాల్పడుతున్న సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. గ్రామాల రక్షణ కోసం పోలీసులకు ప్రజలు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐ నరేష్, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పిఠాపురం ఆడపడుచులకు పవన్ కానుక

రేపు పాదగయలో పదివేల చీరలు, పసుపు, కుంకుమ అందజేత


ప్యాంకింగ్ చేసిన చీరలు, పసుపు, కుంకుమ

పిఠాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గ ఆడపడుచులకు డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ శ్రావణ మాస కానుక పంపారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో శుక్రవారం జరిగే సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో పాల్గొనే మహిళలకు అందించేందుకు పదివేల చీరలు, పసుపు, కుంకుమ సమకూర్చారు. చీరలు, పసుపు, కుంకుమ బుధవారం పిఠాపురం చేరుకోగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వీరమహిళలు ప్యాకింగ్ చేసి పంపిణీకి సిద్ధంగా ఉంచారు. క్షేత్రంలో శుక్రవారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకూ 5 బ్యాచ్‌లుగా వ్రతాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ప్రతి బ్యాచ్ లో వేయి మంది నుంచి 1500మంది వరకూ వ్రతాల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. వ్రతాల్లో పాల్గొన్న వారితో పాటు అక్కడకు వచ్చేవారికి చీరలు అందిస్తారు. వ్రతాల టిక్కెట్లు గురువారం నుంచి జారీ చేస్తామని జనసేన వర్గాలు వెల్లడించాయి. వరలక్ష్మి వ్రతాల క్యూలైన్లు, బారీకేడ్లను కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ పరిశీలించారు.

నేటి నుంచి దిండి-చించినాడ వారధిపై రాకపోకలు బంద్

అమలాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారిపై దిండి-చించినాడ మధ్య ఉన్న వారధి మరమ్మతుల కారణంగా ఈ నెల 21 నుంచి 3రోజుల పాటు ట్రాఫిక్‌ను పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్టు కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు వంతెన మరమ్మతుల దృష్ట్యా ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయాలని పోలీసుశాఖను ఆదేశించారు. ప్రస్తుతం మరమ్మతులకు సంబంధించిన కీలక అంశాల పరిశీలనలో భాగంగా 3 రోజుల పాటు ట్రాఫిక్‌ను నిషేధించినట్టు తెలిపారు. దిండి-చించినాడ మధ్య ప్రయాణించే వాహనదారులు ఈ విషయాన్ని గ్రహించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రవాణా ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

అన్నవరంలో రేపు ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం పుణ్యక్షేత్రంలో ఈ నెల 22న చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా భక్తులు ఉదయం 8గంటలకు స్వామివారి నిత్యకల్యాణమండపం వద్దకు చేరుకోవాలని కోరారు. విచ్చేసే భక్తులు కొబ్బరికాయ, అరటిపళ్లు, విడిపూలు తీసుకుని వస్తే మిగిలిన పూజాద్రవ్యాలను, అమ్మవారి రాగిరూపు దేవస్థానం ఆధ్వర్యంలో సమకూర్చడం జరుగుతుందని ప్రకటనలో తెలిపారు.

భూ పరిపాలనా కమిషనర్, గిరిజన సంక్షేమ కార్యదర్శికి జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు

రంపచోడవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూ పరిపాలనా ముఖ్య కమిషనర్, గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ కార్యదర్శికి జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. రంపచోడవరంలో ఆక్రమణల తొలగింపు పేరుతో నివాస గృహాలను కూల్చేసిన వ్యవహారంలో గిరిజనులకు కూడా నష్టం కలిగించారంటూ రెవెన్యూ, ఐటీడీఏ అధికారులపై రంపచోడవరానికి చెందిన వై.సుభాష్ చంద్రబోస్ జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. నివాస గృహాలు, ఇతర నిర్మాణాలను కూల్చివేసే విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు భిన్నంగా ఇక్కడి అధికారులు వ్యవహరించి గిరిజనులకు నష్టం చేకూర్చారన్నారు. ఆయన ఫిర్యాదును విచారణకు స్వీకరించిన కమిషన్ భూ పరిపాలనా ముఖ్య కమిషన్, గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేశారు. ఫిర్యాదులోని ఆరోపణల నేపథ్యంలో తీసుకున్న చర్యలపై కమిషన్‌కు 30 రోజుల వ్యవధిలో నివేదిక సమర్పించాలని, లేనిపక్షంలో ఈ ఇద్దరు ఉన్నతాధికారులు వ్యక్తిగతంగా కమిషన్ ముందుకు హాజరుకావాల్సి ఉంటుందని కమిషన్ తన నోటీసులో పేర్కొంది.

పారిశుధ్య కార్మికులకు జీతాల చెల్లింపు

అన్నవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సుమారు 350 మంది పారిశుధ్య కార్మికుల జీతాలు బుధవారం పూర్తిస్థాయిలో వారి అకౌంట్‌లో జమ అయ్యాయి. గుంటూరుకు చెందిన కనకదుర్గ మ్యాన్‌పవర్ సర్వీసెస్ సంస్థ ద్వారా ఈ చెల్లింపులు జరిగాయి. 2నెలల జీతాలు పెండింగ్‌లో ఉండగా బుధవారం దేవస్థానం కాంట్రాక్ట్ సంస్థకు అందజేసిన కొద్ది నిమిషాల్లోనే సుమారు రూ.70 లక్షలను 350 మంది కార్మికులకు జమ చేసినట్టు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

ఘంటావారిగూడెంలో అశ్లీల నృత్యాలు, మద్యం పార్టీ

పోలీసుల దాడి

25 మంది పురుషులు, ముగ్గురు యువతుల అరెస్ట్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

నల్లజర్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఘంటవారిగూడెం శివారు గుణ్ణం సురేష్ కొబ్బరితోటలో మంగళవారం రాత్రి 25 మంది పురుషులు, ముగ్గురు యువతులతో కలసి అశ్లీల నృత్యం చేస్తుండగా నల్లజర్ల సీఐ బాలశౌరి తన బృందంతో దాడి చేసి వారిని అరెస్ట్ చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. బుధవారం నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన గుణ్ణం సురేష్, వెజ్జు వెంకట దుర్గా సుబ్బారావు, ఆగసిస్త నాగ వెంకట దుర్గాప్రసాద్, కిలపర్తి దుర్గాశ్రీనివాస్ మరో 21మంది, తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం ప్రాంతాలకు చెందిన ముగ్గురు యువతులతో కలిపి గుణ్ణం సురేష్ పుట్టినరోజు సందర్భంగా కొబ్బరితోటలో పార్టీ ఏర్పాటు చేశారు. ఆ తోటలో 'యు' ఆకారంలో టేబుల్స్ వేసుకుని పురుషులు మద్యం సేవిస్తుండగా, యువతులు ఆ ఖాళీ ప్రదేశంలో అశ్లీల నృత్యాలు చేస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 4 మద్యం బాటిళ్లు, రూ.10 వేలనగదు, ఆరు కార్లను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. గతేడాది ఆగస్టు 16న కూడా వీరు ఇదేవిధంగా యువతులను తీసుకుని వచ్చి డ్యాన్స్ చేస్తుండగా వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. వీరిలో వెజ్జు వెంకటదుర్గా సుబ్బారావుపై ఉంగుటూరు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉందని, వీరిని అరెస్ట్‌చేసి కోర్టుకు తరలించినట్టు చెప్పారు.

ద్రాక్షారామలో చైన్‌స్నాచింగ్

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

ద్రాక్షారామ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలో చైన్ స్నాచర్ మహిళ మెడలో 6 కాసుల బంగారం పుస్తెలతాడు చోరీ చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాయపాలెం లో లిటిల్‌రోజ్ పాఠశాలలో తంగిరాల జయసంతోషి విష్ణు ప్రియ హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తోంది. బుధవారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో విధులు ముగించుకుని స్కూటీపై ఇంటికి వెళుతుండగా ద్రాక్షారామ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం దాటిన తరువాత మోటార్ సైకిల్‌పై వచ్చిన ఒక వ్యక్తి ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలు తాడు లాక్కుని వెళ్లిపోయాడు. విష్ణుప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలకు మార్గదర్శకాలు జారీ

కాకినాడ రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసినట్టు కాకినాడ డీఈవో పి.రమేష్ తెలిపారు. వాటి ప్రకారం ఉపాధ్యాయలు, ప్రధానోపాధ్యాయలు స్పౌజ్, మ్యూచువల్ ప్రాతిపదికపై లీప్ యాప్ ద్వారా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. 21 నుంచి 24 వరకూ ఆన్‌లైన్‌లో బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవడం, వాటి ప్రింటవుట్లను సంబంధిత మండల విద్యాశాఖాధికారికి సమర్పించాలన్నారు. 22 నుంచి 25 వరకూ ఎంఈవో ద్వారా దరఖాస్తు ప్రింటవుట్‌ను స్వీకరించడం, ధృవీకరించడం, 23 నుంచి 26వరకూ జిల్లా విద్యాశాఖాధికారితో ధృవీకరణ, 27న పాఠశాల విద్య డైరెక్టర్‌కు సమర్పణ, 28 నుంచి 29 వరకూ పాఠశాల విద్య డైరెక్టర్ ధృవీకరణ, తుది నిర్ధారణ, ఈనెల 30న ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు.

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.42 కోట్లు

బంగారం 23 గ్రాములు, వెండి 670 గ్రాములు, 10 దేశాల 46 కరెన్సీ నోట్లు

ఆత్రేయపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా వాడపల్లిలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. పర్యవేక్షణాధికారులు వి.సత్యనారాయణ, టీవీఎస్ఆర్ ప్రసాద్.డి.సతీష్‌కుమార్ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. 28 రోజులకు గాను ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.1,19,58,204, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.22,58,603 వెరసి రూ.1,42,16,807 ఆదాయం లభించింది. బంగారం 23 గ్రాములు, వెండి 670 గ్రాములు, 10 దేశాలకు సంబంధించి 46 విదేశీ కరెన్సీ నోట్లు లభించినట్టు ఆలయ ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. లెక్కింపులో అర్చకులు, సేవకులు, దేవస్థాన సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పాదగయ హుండీల ఆదాయం రూ.35.32 లక్షలు

పిఠాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. 166 రోజులకు రూ.35,32,773 ఆదాయం లభించింది. లెక్కింపులో దేవదాయ శాఖ జిల్లా అధికారి కనపర్తి నాగేశ్వరరావు, తనిఖీదారు వడ్డి ఫణీంద్రకుమార్, ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, భక్తులు, బ్యాంకు, ఆలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఆర్థిక సాక్షరతతో ప్రతి ఇల్లూ శక్తివంతం

ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ మహానా

కాకినాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సాక్షరత ప్రతి ఇంటినీ శక్తివంతం చేస్తుందని, ప్రజలను మోసాల నుంచి రక్షిస్తుందని, డిజిటల్ యుగంలో సమర్థమైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడానికి ఉపయోగపడుతుందని ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ మహానా తెలిపారు. ఆర్థిక సమావేశం, సురక్షిత డిజిటల్ బ్యాంకింగ్, వినియోగదారుల రక్షణపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఫీల్డ్ లెవెల్ ఫైనాన్షియల్ లిటరసీ ఈవెంట్ (ఎఫ్ఎల్ఎఫ్ఎల్ఈ)ను కాకినాడలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహానా హాజరై పలు అంశాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ లావాదేవీల విషయంలో భద్రత అవసరమని, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. మోసపోయినప్పుడు జాతీయ హెల్ప్‌లైన్ 1930/14448 ఫిర్యాదు చేయాలని సూచించారు. సామాజిక భద్రతా పథకాలు, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై), ఆర్‌బీఐ ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ పథకం ద్వారా వినియోగదారుల ఫిర్యాదు పరిష్కారం, మరిచిపోయిన డిపాజిట్లను తిరిగి పొందే విధానం ఉద్గమ్ పోర్టల్‌లపై అవగాహన కల్పించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ బీజీఆర్ నాయుడు, కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఆర్.గణేష్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రియంవద, సైబర్ సెక్యూరిటీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామ్‌కుమార్, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న టీడీపీ కాకినాడ రూరల్ కో-కో-ఆర్డినేటర్ ప్రభాకర్

ఘనంగా టీడీపీ నేత బాబీ పుట్టినరోజు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కో-కో-ఆర్డినేటర్, రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) పుట్టినరోజును బుధవారం కరణం గారి సెంటర్లో ఘనంగా నిర్వహించి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. తిమ్మాపురంలోని రెడ్‌క్రాస్ గ్రీన్‌ఫీల్డ్ అంధుల స్కూలు విద్యార్థులతో కేక్ కట్ చేయించిన అనంతరం వారికి పండ్లు, ఆహారం అందించారు. సూర్యారావుపేట కోలాటం కళాకారులు, విద్యార్థులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. గౌడ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు మట్టా ప్రకాశ్‌గౌడ్, కొల్లాబత్తుల అప్పారావు, నాయకులు కాకరపల్లి చలపతిరావు, కౌజు నెహ్రూ, ఏటుకూరి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వలసపాకలలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో బీజేపీ కాకినాడ పార్లమెంటరీ కో-ఆర్డినేటర్ రంబాల వెంకటేశ్వరరావు, బి.రామకృష్ణ, పెండెం బాబ్జీ, కంచుమర్తి చినఅప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

'దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు: డీఎంహెచ్‌వో

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) వర్షాకాలంలో వృద్ధి చెందుతున్న దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ కోరారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన జిల్లా మలేరియా అధికారి డాక్టర్ పి.విల్సన్‌తో కలిసి ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. మలేరియా దోమల ద్వారా వ్యాపిస్తుందని కనుగొన్న శాస్త్రవేత్త సర్ రొనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ దోమల వల్ల వచ్చే వ్యాధుల నివారణ, చికిత్స, దోమలు వృద్ధి చెందే ఆవాసాలను గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. 'ఫ్రై డే డ్రై డే'ను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, డీఎల్ఏటీవో డాక్టర్ పి.ప్రభాకర్, డాక్టర్ అరుణ, డాక్టర్ ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.



సర్ రొనాల్డ్ రాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌వో, కార్యాలయ సిబ్బంది

గణేశ నవరాత్రుల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

పిఠాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటగుమ్మం సెంటర్లో కొలువైయున్న జైగణేష్ దేవస్థానంలో 11 రోజుల గణేశ మాలధారణ దీక్ష, నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికలను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ బుధవారం రాత్రి ఆవిష్కరించారు. ఈవో నున్న శ్రీరాములు, టీడీపీ, బీజేపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 16న నవరాత్రుల పోస్టర్లను జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఆవిష్కరించగా దానికి టీడీపీ ఇన్‌చార్జి వర్మ, బీజేపీ నాయకులను ఆహ్వానించలేదు. దీనిపై తెలుగుదేశం పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

దీంతో అధికారులు మరోమారు కార్యక్రమం ఏర్పాటు చేయడంతో పాటు ఆహ్వాన పత్రికల పోస్టర్లపై సీఎం, దేవదాయ శాఖ మంత్రి, ఎంపీ సతీష్‌బాబు ఫొటోలు కూడా వేసి మరలా ప్రింట్ చేయించారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

టీడీపీ కాకినాడ రూరల్ మండల అధ్యక్ష పదవి కోసం...

సమావేశం రసాభాస

కాకినాడ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధిష్ఠానం ఆదేశాల మేరకు ఆ పార్టీ కాకినాడ రూరల్ మండల అధ్యక్షుడి నియామకం కోసం బుధవారం కాకినాడలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశం రసాభాసగా మారింది. తాము సూచించిన పేరునే పరిగణలోకి తీసుకోవాలని పిల్లి సత్తిబాబు వర్గం బల ప్రదర్శనకు దిగింది. అయితే మెజారిటీ వర్గం మరో పేరు సూచిస్తూ పరిగణలోకి తీసుకోవాలని కోరింది. దీంతో ఎన్నికల పరిశీలకుడు తలముడిపి సుధాకరరెడ్డి, మండల పరిశీలకుడు నడింపల్లి సుబ్బరాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పరిస్థితిని సర్దుబాటు చేయాలని ప్రయత్నించారు. తమ అభిప్రాయాలను సామరస్యపూర్వకంగా తెలియజేయాలని, చాలా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఏదైనా ఉంటే నెమ్మదిగా మాట్లాడుకుని ఎన్నిక ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. అయితే పరిస్థితి సర్దుమణగకపోవడంతో సమావేశాన్ని ముగించి చాంబర్‌లో వేర్వేరుగా నాయకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అధ్యక్ష పదవికి కాళ్ల శ్రీను, కాకరపల్లి చలపతి పేర్లను ఆయా వర్గాల నాయకులు సూచించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, రూరల్ నియోజకవర్గ కో-కో-ఆర్డినేటర్ కన్వీనర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబి), రూరల్ ఎన్నికల పరిశీలకుడు నులుకుర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్‌గౌడ్, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు మేకా లక్ష్మణమూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ కాలా సత్తిబాబు, రామదేవు సీతయ్యదొర పాల్గొన్నారు.

పోస్టల్ రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

కాకినాడ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, వర్కర్స్ యూనియన్ (న్యూఢిల్లీ) పిలుపుననుసరించి సెంట్రల్ హెడ్ క్వార్టర్స్ ఆల్ ఇండియా పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.రాఘవేంద్రన్, ప్రధాన కార్యదర్శి దెబినాథ్ సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయం వద్ద డిమాండ్ల పరిష్కారం కోరుతూ పోస్టల్ రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా చేశారు. 8వ వేతన సంఘం సిఫార్సులను రిటైరైన వారికి వర్తింపజేయాలని, కమిటీని పూర్తి బాధ్యతలతో వేయాలని, వాలిడేషన్ చట్టం రద్దు చేయాలని, ఉద్యోగుల పెన్షన్ హక్కులను పరిరక్షించాలని నినాదాలు చేశారు.

కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ లక్ష్మీనారాయణ, డివిజనల్ కార్యదర్శి తురగా సూర్యారావు, ఫైనాన్స్ కార్యదర్శి సీహెచ్ రామారావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.భాస్కరరావు, వైస్ ప్రెసిడెంట్లు ఎన్.త్రినాథరావు, ఎం.కూర్మారావు, పరిశీలకులు అఫ్తాబ్ హుస్సేన్, సర్వేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ పరిరక్షణకు ఐఎల్ఏ కృషి అభినందనీయం'

కాకినాడ క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఏ) చేస్తున్న కృషి అభినందనీయమని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం కొనియాడారు. ఈ నెల 30, 31 తేదీల్లో గుంటూరులో జరిగే ఐఎల్ఏ రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను బుధవారం ఆయన బార్ అసోసియేషన్ హాల్లో ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలపై చర్చిస్తామన్నారు. ఐఎల్ఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్ మాట్లాడుతూ రాజ్యాంగ నైతికతను పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, బెంచ్-బార్ సంబంధాల మెరుగు, న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, ఐక్యత సమాజంలో అణచివేతకు గురవుతున్న వారి హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై చర్చ జరగనుందన్నారు. అడ్వకేట్లు బి.గోపీకృష్ణ, మహ్మద్ జవహర్ అలీ, ముత్తింటి విశ్వేశ్వరావు, వడ్డి శ్రీనివాసబాబు, రాగాల శివ, కోలా శ్రీహరిరావు, జేవీ రమణ, మంగం కిట్టు, ముద్రగడ వీరబాబు, పిల్లి శ్రీనివాస్, పెందుర్తి ప్రసన్నకుమార్, కుంచే శ్రీహరి, కంచి కామాక్షి, ఉమామహేశ్వరి, కల్యాణి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





కాకినాడ బార్ అసోసియేషన్ హాలులో ఐఎల్ఏ రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు (పైన), పిఠాపురంలో (కింద)

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే ఐఎల్ఏ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, పిఠాపురం శాఖ అధ్యక్షుడు కొంగు నూకరాజు కోరారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో పోస్టర్, కరపత్రాలను న్యాయవాదులతో కలిసి ఆవిష్కరించారు. న్యాయవాదులు అనిశెట్టి కాశీవిశ్వనాథరెడ్డి, వాణి, కొంజర్ల అప్పారావు, వేళంగి వెంకటేష్, సరిదే నాగేశ్వరరావు, డి.బ్రహ్మారావు తదితరులు పాల్గొన్నారు.

'సీఎం పర్యటనను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో ఈ నెల 23న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రుల పర్యటనకు పెద్దాపురం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చేలా చైతన్యవంతం చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. సామర్లకోట పూర్ణా కల్యాణ మండపం, పెద్దాపురం రోడ్డులోని హెలిప్యాడ్, ప్రభుత్వ కళాశాల హెలిప్యాడ్, భాస్కర్‌నగర్ చెంతన ప్రైవేట్ లే-ఔట్‌లో కార్యకర్తల సమావేశ స్థలిని సామర్లకోట, పెద్దాపురం టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించి తగు సూచనలు చేశారు. ఉదయం పూర్ణా కల్యాణ మండపం, సాయంత్రం టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్ కార్యాలయంలోను నాయకులతో సమావేశమయ్యారు. మహిళలకు, విచ్చేసే వారికి అల్పాహారం, తాగునీటి ప్యాకెట్ల సరఫరాలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సమావేశంలో టీడీపీ నాయకులు రాజా సూరిబాబురాజు, అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్ (బాబు), రంధి సత్యనారాయణ, తోట కూర శ్రీనివాసు, గుమ్మళ్ళ రామకృష్ణ, మునిరెడ్డి శ్రీరాములు, ఎలిశెట్టి నాని, కొత్తిం శ్రీనివాసరావు, బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, చీకట్ల వెంకటేష్, చల్లా బుజ్జి, పెంకే వెంకటేష్, పైడి శ్రీనివాసు, మహంకాళి వెంకటగణేష్, వల్లూరి దొరబాబు, యండమూరి వాసు, నిమ్మకాయల కిరణ్‌కుమార్, అందుగుల జార్జి చక్రవర్తి, గొలితి సత్యనారాయణ, ఎండీ సైఫుల్లా, బొందల రామలక్ష్మి, కొర్లమండ శ్రీవాణి, కొర్లమండ వీరభద్రరావు, బాడితమాని త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



ఇన్వర్టర్ బహూకరిస్తున్న మహాలక్ష్మి

ఓల్డేజ్ హోమ్‌కు ఇన్వర్టర్ బహూకరణ

పిఠాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సాధ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన సాధ్య ఓల్డేజ్ హోమ్‌కు ఎన్ఆర్ఐ దేవరపల్లి మహాలక్ష్మి ఇన్వర్టర్, బ్యాటరీని బుధవారం ఫౌండేషన్ అధినేత కన్నాబత్తుల అనిల్‌కుమార్‌కు అందజేశారు. భవిష్యత్తులో సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. బండి సాయికుమార్, హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట'

తాళ్లరేవు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్నమైన మార్పులు చేపట్టిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం హైస్కూల్లో అంగాడి కన్నయ్య-ధనలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం అంగాడి తాతారావు దంపతులు ఏర్పాటుచేసిన చదువు తల్లి సరస్వతీదేవి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. హైస్కూల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని హెచ్ఎం గోవిందరాజులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఇళ్ల స్థలాలు, తాగునీరు అందివ్వాలని మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించారు. విగ్రహ దాత తాతారావు దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు. సర్పంచ్‌లు కామాడి గోవలక్ష్మి, టిల్లపూడి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చెక్కా శివ, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, లంకే నూకరాజు, మల్లాడి వరదరాజు, ధూళిపూడి వెంకటరమణ, వుంగరాల వెంకటేశ్వరరావు, పెసింగి ఈశ్వరరావు, లక్ష్మీపతిపురం, పెదవలసల గ్రామాల పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



లక్ష్మీపతిపురం హైస్కూల్లో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

లే-ఔట్ అక్రమాలకు పాల్పడిన ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్‌లో కోత

కాకినాడ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో అనుమతి పొందిన లే-ఔట్లలోని సామాజిక స్థలాల్లో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగులపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. అక్రమాలకు బాధ్యులను చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎ.నరసింహమూర్తి పెన్షన్‌లో 5 శాతం కోత విధించింది. పంచాయతీ విశ్రాంత కార్యదర్శి పీఎస్ రాజేశ్వరరావు పెన్షన్‌లో రెండేళ్ల పాటు 10 శాతం కోత విధిస్తూ పంచాయతీరాజ్ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

'ఆవిష్కాంధ్ర' ప్రత్యక్ష ప్రసారం

జేఎన్టీయూకే, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో ఆవిష్కాంధ్ర కార్యక్రమాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రారంభించారు. దీనిని వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో ప్రత్యక్ష ప్రసారం చేయగా సుమారు 1,200 మందికి పైగా విద్యార్థులు వీక్షించారు. ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు 5 కేంద్రాలు ఉన్నాయని, వాటికి జేఎన్టీయూకే నాలెడ్జ్ పార్టనర్‌గా ఉందన్నారు. కాబోయే పారిశ్రామికవేత్తలకు కావాల్సిన మెంటార్‌షిప్, సాంకేతిక సహకారం, మౌలిక సదుపాయాలను యూనివర్సిటీ నుంచి అందజేస్తామన్నారు. ఇన్నోవేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించగా ప్రిన్సిపాల్ ఎస్.మోహన్‌రావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భవనాల నిర్మాణానికి రూ.8 లక్షలు ఇస్తాం

డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి

తాళ్లరేవు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు సహకార సంఘం, సెంట్రల్ బ్యాంక్ భవనాల నిర్మాణానికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నుంచి రూ.8 లక్షలు ఇస్తామని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. బుధవారం ఆయన తాళ్లరేవు సొసైటీని సందర్శించి భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణానికి సొసైటీలో రూ.60లక్షలు ఉందని సీఈవో మోహన్‌కృష్ణ తెలిపారు. డీసీసీబీ నుంచి రూ.8లక్షలు ఇస్తామని భవన నిర్మాణం చేపట్టాలని చైర్మన్ కోరారు. రామస్వామి విలేకరులతో మాట్లాడుతూ రైతులకు తక్కువ వడ్డీలకు అప్పులు ఇవ్వాలని ఆలోచన చేస్తున్నామన్నారు. సొసైటీల అధ్యక్షులు విళ్ల వీర వెంకట ఆదినారాయణ, మోపూరి వెంకటరెడ్డినాయుడు, కొప్పిశెట్టి బద్రేశ్వరరావు, బొండా వెంకన్న, జనసేన నేత గుద్దటి జమ్మి, సొసైటీల సీఈవోలు పాల్గొన్నారు.



త్వరలో కాకినాడలో కాంగ్రెస్ ఓబీసీ సమావేశం

కాకినాడ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నగరంలో త్వరలో ఓబీసీ సమావేశం నిర్వహించనున్నామని రాష్ట్ర చైర్మన్ శౌంటి నాగరాజు తెలిపారు. బుధవారం సాయంత్రం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఓబీసీ నూతన కమిటీలను వేస్తామన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లను నియమించామన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు పాల్గొన్నారు.

గణేశ నవరాత్రి ఉత్సవాలకు పందిరిరాట ముహూర్తం

కొత్తపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పోలంగుమ్మం సెంటర్లో గణేష్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 40వ గణేశ నవరాత్రి మహోత్సవాలకు భక్తులు బుధవారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఎటువంటి అవిఘ్నాలు లేకుండా ఉత్సవాలు ఘనంగా జరగాలని కోరుతూ పూజలు చేశారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్‌లో గల ఆలయంలో గణపతి నవరాత్ర ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం జరిపారు. గౌడ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరుకాగా మలిరెడ్డి ప్రసాద్, సూరి సత్తి, ఆలయ కమిటీలోని మహిళలు పాల్గొన్నారు.



చేబ్రోలులో స్థానికులతో మాట్లాడుతున్న డీపీవో రవికుమార్

స్వచ్ఛత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

డీపీవో రవికుమార్

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వీధుల్లో చెత్తాచెదారం లేకుండా చూడడం ద్వారా స్వచ్ఛత గ్రామాలుగా తీర్చిదిద్దుతామని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ సూచించారు. బుధవారం ఆయన చేబ్రోలులో తనిఖీలు నిర్వహించారు. ఇంటింటా చెత్త సేకరణను పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీవో విద్యాసాగర్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.



రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిని

కలిసిన కాకినాడ ఎంపీ

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీఏ కూటమి బలపర్చిన అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను బుధవారం న్యూఢిల్లీలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాధాకృష్ణన్‌ను అభ్యర్థిగా ప్రకటించడం సంతోషమని, ఆయన అనుభవం దేశానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సూచనల మేరకు రాధాకృష్ణన్‌కు తమ పార్టీ మద్దతు తెలుపుతుందన్నారు.



ముసలమ్మ తల్లిని దర్శించుకుంటున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

ఘనంగా ప్రారంభమైన ముసలమ్మ తల్లి జాతర

పెద్దాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిమేరు గ్రామ దేవత ముసలమ్మ తల్లి జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) వీటిని ప్రారంభించారు. జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన డప్పు వాయిద్యాలు, గరగల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



ఎరైజ్ ప్రోగ్రాం బ్రోచర్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న హెచ్‌సీఎల్ ప్రతినిధి వినోద్

కలెక్టర్‌ను కలిసిన హెచ్‌సీఎల్ ప్రతినిధి

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ షాన్‌మోహన్‌ను హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతినిధి డి.వినోద్ బుధవారం కలిశారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నిర్వహిస్తున్న ఎరైజ్ 4యు ప్రోగ్రాం ద్వారా జరిగే శిక్షణా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ద్వారా విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను, ఇన్నోవేటివ్ ఆలోచనల ద్వారా వివిధ ప్రాజెక్టులు తయారు చేయడానికి ఎరైజ్ ప్రోగ్రాం ద్వారా 40 రోజులు శిక్షణ ఇస్తామన్నారు. ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. రిజిస్ట్రేషన్ కోసం కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు పాల్గొన్నారు.

రాచపల్లిలో దోమల నిర్మూలన ర్యాలీ

ప్రత్తిపాడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రాచపల్లిలో దోమల నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. దోమలు మురికినీటి నిల్వలు, తాగిపడేసిన కొబ్బరిబొండాలు, టైర్లు, ఏసీ, ఫ్రిజ్‌లో దోమలు గుడ్లు పెట్టి సంతానోత్పత్తిని పెంచుకుంటాయని, దోమల నిర్మూలనకు ప్రజలు చర్యలు చేపట్టాలని వైద్యాధికారి కె.ఉషశ్రీ తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వీరన్న, ల్యాబ్ టెక్నీషియన్ అజయ్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఉప్పొంగుతున్న గోదావరి, శబరి

● పునరావాస కేంద్రాలకు తరలివెళ్తున్న పలు ప్రాంతాల ప్రజలు
● నిరంతరం ముంపు ప్రాంతాల్లో పర్యవేక్షిస్తున్న అధికారులు



కూనవరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరి నది

కూనవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మరోసారి శబరి, గోదావరి నదులు ఉప్పొంగటంతో మండల ప్రజలకు గోదావరి వరద భయం వెంటాడుతోంది. బుధవారం సాయంత్రానికి కూనవరం వద్ద 42 అడుగులతో గోదావరి ప్రవహిస్తోంది. దీంతో కూనవరం భద్రాచలం ప్రధాన రహదారిలో పోలిపాక వద్ద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు కూనవరం వద్ద ఈ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. టేకుల బోరు కొండ్రాజుపేట రహదారి మధ్య వరద నీరు చేరింది. కూనవరంలోని కొందమంది ఉదయభాస్కర్ కాలనీ ప్రజలు వరద భయంతో పునరావాస కేంద్రాలకు వెళ్లారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.



గోదావరిలో పూర్తిగా నీటమునిగిన గండి పోశమ్మ ఆలయం

దేవీపట్నం: మండలంలో గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇనుకొండ సీతపల్లి, తదితర వాగులు పొంగిప్రవహిస్తున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఇలాగే గురువారమూ కొనసాగితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. ప్రసిద్ధి పుణ్యక్షేత్రం స్వయంభూగా వెలిసిన మాతృశ్రీ గండి పోశమ్మ ఆలయ గోపురం పై భాగం వరకు వరద నీరు చేరి వచ్చి చేరింది.

ఎటపాక : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నదికి వరద తాకిడి పెరుగుతోంది. బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద 47 అడుగుల గోదావరి నీటిమట్టం నమోదైంది. మురుమూరు వద్ద భద్రాచలం-కూనవరం రోడ్‌లో వరదనీటి ప్రవాహం రహదారిపైకి చేరడంతో ఇటువైపుగా బుధవారం సాయంత్రం నుంచి వాహనరాకపోకలు నిలిచిపోయాయి. అలాగే నెల్లిపాక - వీరాయిగూడెం మధ్యలో ప్రధాన రహదారిపై వరద చేరడంతో ఈ రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. కాగా గోదావరి వరద పెరుగుల నేపథ్యంలో భద్రాచలం వద్ద ఉదయం అక్కడి అధికారులు 43 అడుగులకు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. 48 అడుగులకు చేరుకుంటే రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు. మరోవైపు ముంపు గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.అత్యవసర సమయాల్లో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు. కాగా గోదావరి వరద మరో రెండు, మూడు అడుగుల మేర పెరిగే అవకాశాలున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

వీఆర్‌పురం: వారం రోజులుగా ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి, శబరి నదులు ఉగ్రరూపం దాల్చాయి. దీంతో వరదనీరు వివిధ గ్రామాలలోని ప్రధాన రహదా రులపైకి గోదావరి వరదనీరు చేరడంతో రాకపోకలు నిలిచాయి. ఈ వరద నీరు కారణంగా 30 గ్రామాలు పైగానే జల దిగ్బంధంలో ఉన్నాయి. ఇప్పటికే మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్నవరం చప్టా వారం రోజుల క్రితం కూలిపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

మాదక ద్రవ్యాలతో పెను ముప్పు



మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ సూర్య మోహన్ రావు

మోతుగూడెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో బుధవారం ఏపీ జెన్కో లోయర్ సీలేరు డీఏవీ పాఠశాలలో మాదక ద్రవ్యాలు - దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రజా జీవితం ప్రమాదంలో పడే ఉందనే దానిపై బుధవారం అవగాహన కల్పించారు. దీనికి యాంటీ నార్కోటిక్స్ అవేర్నెస్ డ్రగ్స్ విభాగం రాజమండ్రి సీఐ సూర్య మోహన్‌రావు, ఎస్సై నారాయణరావు హాజరయ్యారు. ముఖ్యంగా విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలు వాడకంతో నిండు జీవితాలు నాశనమవుతాయన్నారు. వీటికి దూరంగా ఉండాలని వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు మల్లెల రఘురాం, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రికి కంటి, దంత పరీక్షల మెషిన్

రంపచోడవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. ఈ మేరకు ఐటీడీఏ ద్వారా ఆసుపత్రిలో కంటి పరీక్షల కోసం ఏఆర్ మెషిన్, దంత పరీక్షల కోసం డెంటల్ ఎక్స్‌రే పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. గిరిజన ప్రాంత ప్రజలు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిసారించాలి : పీవో



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఉపాధ్యాయులను ఆదేశించారు.బుధవారం ఆయన పెదగెద్దాడ మండల పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అలాగే వారికి అర్థమయ్యేలా బోధించాలని టీచర్లకు సూచించారు. పాఠశాల పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

అబ్బురపరిచిన బ్రహ్మకమలాలు



అడ్డతీగల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఏజన్సీ ప్రాంతమైన అడ్డతీగలలో బ్రహ్మకమలాలు అబ్బురపరిచాయి. ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 12 పువ్వులు పూయడంతో గ్రామస్థులు వచ్చి ఆసక్తిగా తిలకించారు. స్థానిక కారంమిల్లు వీధిలో నివాసముంటున్న ప్రభుత్వ ఉద్యోగి దేవకుర్తి నాగేశ్వరరావు ఇంటి ఆవరణలో ఈ వింత చోటుచేసుకుంది. ఏజన్సీలో అరుదుగా ఈ ఇలాంటి పూలు పూస్తుంటాయి.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కార్మికుల ప్రయోజనాలే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ తదితరులు

జగ్గంపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధం జిల్లా రెండో మహాసభలు సెప్టెంబరు 30, అక్టోబరు ఒకటో తేదీన నిర్వహిస్తారు. ఈసందర్భంగా సభల పోస్టర్‌ను రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆవిష్కరించారు. కార్మికుల ప్రయోజనాలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహాసభలు జయప్రదానికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు చెక్కల రాజ్‌కుమార్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, శ్రీవినాయక రావుల మ్మతల్లి తాపిమేస్త్రి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు బోరా సత్తిబాబు, ప్రెసిడెంట్ కొల్లి సత్తిబాబు, సెక్రటరీ కెంగం దుర్గాప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కెంగం బుజ్జి, జనపరెడ్డి రమణ, పైడి యేసు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి సత్కారం

జగ్గంపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక జీవీఆర్ అపార్టెమెంట్‌లో టీడీపీ మండలాధ్యక్షుడు జీను మణిబాబును జగ్గంపేట శ్రీషిర్డిసాయి టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు కింతాడ వెంకటరమణ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే జగ్గంపేట పద్మశాలి సంఘం అధ్యక్షుడు గిడుతూరి సత్యనారాయణ మణిబాబును సత్కరించారు. కార్యక్రమంలో టైలర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సింగవరపు శ్రీనివాస్, సెక్రటరీ కేసుబోయిన నాగేశ్వరరావు, జాయింట్‌సెక్రటరీ నీలపల్లి వాసు, గౌరవాధ్యక్షులు వాకా నాగిరెడ్డి, బొడ్డు కొండ శ్రీను, జిల్లా వైస్‌ప్రెసిడెంట్ ఆదిమూలం ప్రసాద్, తుమ్మల కిషోర్, జీలంఅప్పారావు, సుధా కృష్ణ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

ప్రత్తిపాడు, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో రాజీవ్‌గాంధీ జయంతి ని బుధవారం నిర్వహించారు. అంబేడ్కర్ కళామందిర్ సెంటర్‌లో రాజీవ్ గాంధీ విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను ఆధ్వర్యంలో కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను మాట్లాడుతూ విదేశీ పెట్టుబడులు, మహిళల అభివృద్ధి, ఐటీ రంగ అభివృద్ధిలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు మహత్తరమైనవని కొనియాడారు. కందిమళ్ళ శామ్యూల్, దాసరి సత్తిబాబు, గొర్లపూడి కోటేశ్వరరావు, ఎం.రాంబాబు, సలాది దొరబాబు, ముప్పల అప్పన్న పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలి

ఏలేశ్వరం, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది నేతృత్వంలో బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. వైద్యురాలు సౌభాగ్య సరోజ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కృష్ణ కళ్యాణ్, రాజేంద్ర ప్రసాద్, విజయలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అన్నవరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ఏలేశ్వరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించే ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు అన్నారు. మండలంలోని పెద్దనాపల్లి, యర్రవరం, సిరిపురం, భద్రవరం, ఏలేశ్వరం గ్రామాల్లో బుధవారం ప్రచారంచేసి కరపత్రాలు అందజేశారు. భక్తులు కొబ్బరికాయలు, పువ్వులు, అరటిపండ్లు తెచ్చుకోవాలన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

ప్రత్తిపాడు, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): గ్రామం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలు తోడ్పాటు అందించాలని గోకవరం సర్పంచ్ వనపర్తి రామలక్ష్మినాగేశ్వరరావు కోరారు. గోకవరంలో తడి, పొడి చెత్తల సేకరణపై కరపత్రాల పంపిణీతో పాటు గ్రామ పారిశుధ్యంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించారు. సెక్రటరీ బి.వీరబాబు, జేఏబీసీ బి.నాగార్జున పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జగ్గంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐలో 2025-26 విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీకి మూడో విడత ప్రవేశం కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.కృష్ణన్ తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్, ట్రేడ్స్ అభ్యర్థులు ఆగస్టు 26న సాయంత్రం 5 గంటలలోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్, టికెట్స్ నకలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 94402 62266, 81423 45444లో సంప్రదించాలని కోరారు. ఆన్‌లైన్‌లో వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులంతా కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తొండంగి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీకె మెహర్ తెలిపారు. బీఏ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ సింగిల్ మేజర్ హానర్స్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో లేదా కళాశాలలో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. ఈ నెల 20 నుంచి 26 వరకూ దరఖాస్తులు స్వీకరించి పరిశీలన అనంతరం 31న అర్హుల జాబితా విడుదల చేస్తామన్నారు. సెప్టెంబరు 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.



ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి బుధవారం ఒకదాత రూ.1,16,116 విరాళంగా సమర్పించారు. కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన నెక్కింటి గోపాలకృష్ణ మూర్తి ఈ విరాళాన్ని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా దాతకు స్వామి వారి ప్రసాదంతో పాటు ప్రత్యేక దర్శనం కల్పించారు.

రహదారి నిర్మించాలంటూ ధర్నా

కిర్లంపూడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం, తోట రాంజీ ఆధ్వర్యంలో రామచంద్రపురం గ్రామంలో బుధవారం రాజుపాలెం-రామవరం వెళ్లే రహదారిని నిర్మించాలంటూ ధర్నా జరిపారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లపై వరినాట్లు నాటి నిరసన తెలిపారు. ఈ రోడ్డు పనులకు వెంటనే నిధులు కేటాయించాలని కోరారు.

పరదేశమ్మ జాతర ఉత్సవాలు

తునిరూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.అన్నవరం కొత్త సూరవరం గ్రామంలోనున్న పరదేశమ్మ జాతరను పురస్కరించుకుని సుమారు 100 మంది భక్తులు అమ్మవారి మాల ధారణ గావించారు. ఈ సందర్భంగా దీక్ష పూర్తి చేసి బుధవారం ఇరుముడిని గ్రామ వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో అందజేశారు. గురుస్వాములు చోడిశెట్టి కన్నా ప్రకాశ్‌రావు, పాలూరి చక్రరావు, కంకిపాటి రమణ, ప్రగడ గంగ, వంగలపూడి రమణ, వీర్ల మూలేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ శోభాయాత్ర సాగింది.

జాతీయ స్థాయి యోగా పోటీలకు 'శ్రీప్రకాష్' విద్యార్థులు



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తునిరూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన సీబీఎస్ఈ సౌత్ జోన్ యోగా పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం, బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. అండర్-14విభాగంలో చైతన్య, తేజ, ఆశ్రిత్ చరణ్‌కుమార్, వ్యక్తిగత విభాగంలో చరణ్‌కుమార్, అండర్-17లో జి.సోమ సూర్యచరణ్, బి.దేవాన్ష్ నాయుడు,పి.సోహన్‌శ్రీ, సీహెచ్‌జయదీప్, సీహెచ్.రక్షిత్ సెప్టెంబరు 13నుంచి 16వరకు శ్రీరామ్ గ్లోబల్ స్కూల్, న్యూవల్, హరియాణాల్లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సంప్రదాయ ఈవెంట్‌లో జి.సోమ సూర్యచరణ్ బంగారు పతకం, దేవాన్ష్‌నాయుడు రజత పతకం, సీహెచ్.రాక్షిత్ కాంస్య పతకం, పి.సోహన్‌శ్రీ నాల్గో స్థానం సాధించారు. విజేతలను విద్యాసంస్థల అధినేత సీహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజ య్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, యోగా గురువులు సురేష్, జయంతి అభినందించారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన



పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

కిర్లంపూడి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా మండలంలోని పాలెం, సోమరాయునిపేట శివారు నీట మునిగిన పంట పొలాలను డీఏఏటీసీ శాస్త్రవేత్త శర్మ, ఎఆర్ఎస్ పెద్దాపురం శాస్త్రవేత్త సుధీర్ పరిశీలించారు. పొలాల్లో నీరు పోవడానికి రైతులు బూస్టర్ జిన్ ఇంకేజీల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీ సుధామాధురి, ఏఈవో సురేష్, వీఏఏ విజయారాణి, రైతులు పాల్గొన్నారు.

గంగవరంలో మట్టి అక్రమ తవ్వకాలు



ఏలేరు గట్టు మట్టిని తవ్విన దృశ్యం

రౌతులపూడి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గంగవరంలో వైసీపీ నాయకులు ప్రేవేట్ లేఅవుట్లకు ఏలేరు కాలువ మట్టిని అక్రమంగా తరలించి సొమ్ములు చేసుకుంటున్నారు. రాజవరం శివారు రహదారి పక్కనే ఉన్న ప్రైవేట్ లేఅవుట్‌కు ఏలేరు కాలువ మట్టిని పట్టపగలు తరలిస్తున్నారు. గతంలోనూ అనుమతులు లేని లేఅవుట్ పేరిట 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించగా పంచాయతీ, రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా వైసీపీ శ్రేణులు ఎక్కడా బెదరడం లేదు. లేవుట్‌కు ఏలేరు కాలువ మట్టిని తరలిస్తున్నారు. ఏలేరు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

కిర్లంపూడి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తామరాడ గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయ మూడో వారికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. పరిసర గ్రామాల ప్రజలు స్వామిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



పొలాలను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

ముంపు పొలాలను పరిశీలించిన టీడీపీ నేతలు

తొండంగి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కొమ్మనాపల్లిలో నీటి ముంపునకు గురైన పొలాలను టీడీపీ గ్రామ నేతలు బుధవారం పరిశీలించారు. గ్రామంలో సుమారు 300 ఎకరాలు ముంపుబారిన పడటంతో వ్యవసాయశాఖ సహాయకుడితో పాటు వీఆర్వో ఇతర సిబ్బందితో నష్టం పరిశీలన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత కోన రాంబాబు, విద్యా కమిటీ చైర్మన్ కె.నానాజీ, మాజీ సర్పంచ్ బోనేపల్లి శంకరరావు, వీఆర్వో తదితరులు ఉన్నారు.

11 బస్తాల పీడీయస్ బియ్యం పట్టివేత

శంఖవరం, ఆగ స్టు 20(ఆంధ్రజ్యోతి): శంఖవరం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 11 బస్తాల పీడీయస్ బియ్యాన్ని పోలీసులు, సివిల్ సప్లైయి అధికారులు పట్టుకున్నారు. ప్రత్తిపాడు సీఐ, ఎస్ఐకు అందిన సమాచారం మేరకు సివిల్ సప్లైయి అధికారులతో కలిసి దాడిచేసి కాళ్ల సత్యనారాయణ ఇంట్లో 11 బస్తాలను గుర్తించారు. వీటి విలువ రూ.19,734 ఉంటుందని వారు తెలిపారు. కార్డుదారుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆర్టీసీ బస్సు దిగుతుండగా మహిళలకు గాయాలు

జగ్గంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో ఆర్టీసీ బస్సు దిగుతుండగా మహిళలకు గాయాలైన ఘటన బుధవారం జరిగింది. స్థానికులు వివరాల ప్రకారం.. గోకవరం గ్రామానికి చెందిన రేవడ రాజేశ్వరి తన కూతురుని తునిలో అత్తగారింటికి దింపేందుకు వెళ్తుండగా జగ్గంపేటలోని ఆర్టీసీ బస్సులో కూతురిని ఎక్కించి బస్సు దిగుతున్న సమయంలో కాలుజారి చక్రం కింద పడిపోయింది. దీంతో ఆమె కాలు నుజ్జయ్యి తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే చుట్టుపక్కలవారు ఆమెను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

కిర్లంపూడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఆటో కార్మికులు నష్టపోతున్నారని వక్తలన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ కిర్లంపూడిలో పలు ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏనుగు వీధి సెంటర్లో మానవహారం చేశారు. డిప్యూటీ తహశీల్దార్ సాయికిరణ్‌కు వారు వినతిపత్రాన్ని అందజేశారు.

సారా పట్టివేత

రౌతులపూడి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి గ్రామ శివారులో 60 లీటర్ల సారాను పోలీసులు పట్టుకున్నారు. సారా తరలిస్తున్న జి.వెంకటరమణను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది రాంబాబు, రాఘవ, వెంకటేష్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్టీ రాజాపురం, గండేపల్లి, కె.గోపాలపురం గ్రామాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ వీరభద్రరావు, ఏఈ కిరణ్ కిషోర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే చర్యలు'

కోటనందూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ టి.రామకృష్ణ అన్నారు. బుధవారం కోటనందూరు సెంటర్లో హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. తప్పనిసరిగా అందరూ హెల్మెట్ ధరించాలని సూచించారు.

'అర్హత ఉంటే పింఛను'

తునిరూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పింఛను మంజూరు చేయడంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని ఎంపీపీ బొప్పన రాము అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ఏ ఒక్క దివ్యాంగుల పింఛన్ పోదని, పరిశీలనలో భాగంగా పలువురికి నోటీసులు మాత్రమే ఇచ్చారన్నారు. నోటీసు అందుకున్న వారి ప్రతీ ఒక్కరి పింఛన్ పోతుందని విషప్రచారం చేస్తున్న ప్రతిపక్ష నాయకుల మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సాయి నవీన్ ఉన్నారు.

'లోవ'లో రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

తునిరూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానంలో శుక్రవారం శ్రావణ మాస సామూహిక వరలక్ష్మి వ్రతాలతో పాటుగా కుంకుమార్చనలు ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈవో విశ్వనాథరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పూజల్లో పాల్గొనే వారికి వేదపండితుల వేద ఆశీర్వచనంతో పాటు ఉచితంగా పూజా సామగ్రి ఆలయం తరుపున అందజేయనున్నట్టు తెలిపారు.

అదనపు కోర్టును ఏర్పాటు చేయాలి

ప్రత్తిపాడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో అదనపు కోర్టును ఏర్పాటు చేయాలని స్థానిక బార్ అసోసియేషన్ నాయకులు బుధవారం ఉమ్మడి జిల్లా జడ్జి గంధం సునీతను కోరారు. రాజమహేంద్రవరంలోని జిల్లా జడ్జి చాంబర్‌లో ఆమెకు స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, న్యాయవాదులు పిల్లి బలరాముడు, భారతి, న్యాయవాది గుమస్తా వీరాస్వామి తదితరులు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి అదనపు కోర్టు అవసరమన్నారు. కోర్టు ప్రాంగణంలో క్యాంటీన్, స్టేషనరీ షాపుల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రత్తిపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం కోరారు. ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. డ్రగ్స్, సెల్‌ఫోన్, గంజాయి, వంటివి విద్యార్థులు వినియోగించకూడదన్నారు. ఎస్ఐను ఉపాధ్యాయులు సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

సుబ్బారెడ్డిసాగర్‌కి జలకళ



సుబ్బారెడ్డి ప్రాజెక్టుకు కుడికాల్వ వద్దకు చేరిన వరదనీరు

ప్రత్తిపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గడిచిన 4 రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టుకు జలకళ వచ్చింది. సాగర్ ప్రాజెక్టు కుడి మదుం వద్ద 81 మీటర్లకు నీటి మట్టం చేరుకుంది. ఇంకా రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు సంభవిస్తే ప్రాజెక్టులోకి సంవృద్ధిగా జలాలు చేరుతుందని రైతులు భావిస్తున్నారు.

శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం

అన్నవరం-533406, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్

ఇ-ప్రొక్యూర్ మెంట్- టెండరు కం బహిరంగ వేలము ప్రకటన

ఆర్.సి.నెం.సి1/53699/2025, తేది:21.07.2025

శ్రీ స్వామి వారి దేవస్థానమునకు సంబంధించిన ఈ దిగువ ఐటమ్‌నకు ఇ-ప్రొక్యూర్ మెంట్ సీల్డు టెండరు కం బహిరంగవేలం నిర్వహించబడును.

వ. సం	వివరములు	ప్రథమ ధరావత్తు రూ.లు	కాల పరిమితి
1	కొండ దిగువ 4 మరియు 6 చక్రముల వాహనములకు టోల్ రుసుము వసూలు చేసుకొను లైసెన్సు హక్కునకు(2 పర్యాయం)	30,00,000/-	2 సం.లు
2	సత్యనికేత్ షాప్ నెం.7 (6 పర్యాయం)	1,00,000/-	3 సం.లు
3	ఓల్డ్ సి.సి (కాటేజీ) వద్ద గల కాఫీ & టీ స్టాల్ నిర్వహించుకొను లైసెన్సు హక్కునకు (3వ పర్యాయం)	1,00,000/-	2 సం.లు
4	ఎస్.ఆర్.సి (సత్రము) వద్ద కాఫీ & టీ స్టాల్ నిర్వహించుకొను లైసెన్సు హక్కునకు (2వ పర్యాయం).	50,000/-	2 సం.లు
5	కొండపై పడమట రాజగోపురం వద్ద జ్యూస్ షాపు నిర్వహించుకొను లైసెన్సు హక్కునకు (2వ పర్యాయం)	1,00,000/-	2 సం.లు

పై తెలిపిన ఐటమ్సునకు ఇ-ప్రొక్యూర్మెంట్ మరియు సీల్డు టెండరు కం బహిరంగ వేలం నిర్వహించబడును. టెండరు షెడ్యూల్సును ది.25.08.2025 నుండి ది.28.08.2025 వరకు కార్యాలయ పనివేళలలో రూ.1,180/- చెల్లించి పొందవచ్చును. టెండరు షెడ్యూల్‌ను ది.29.08.2025న ఉదయం 11.00 గంటల వరకు కొండపై కళావేదిక వద్ద వుంచబడిన టెండరు బాక్సు నందు వేయవలెను. ఇ-ప్రొక్యూర్‌మెంట్ కొరకు వెబ్ సైట్ www.eprocurement.gov.in ను సంప్రదించవచ్చును. మరియు కార్యాలయము పనివేళలలో గాని లేదా ఫోన్ నెం 9494940616, 7207335477 నందు సంప్రదించవచ్చును.

కార్యనిర్వహణాధికారి